www.visalaandhra.com
మంగళవారం
25-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 302
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నిరసనలతో దద్దరిల్లిన స్వీడన్

స్వీడన్ నగరాలు నిరసనలతో దద్దరిల్లాయి. అంతర్జాతీయ సైనిక విన్యాసానికి ఆతిథ్యం ఇవ్వడం, నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో)లో సభ్యత్వానికి వెంపర్లాడుతున్న ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 17 నగరాల్లో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. నాటో అమెరికా యుద్ధ తంత్రం అంటూ ప్రజలు నినదించారు.

2లో

అవినాశ్‌కు చుక్కెదురు

- తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేసిన సుప్రీం
- వివేక హత్య కేసు విచారణ గడువు పెంపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా పేర్కొన్న అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేయగా, ఈనెల 25 వరకు ఆయనను అరెస్ట్ చేయవద్దంటూ సీబీఐని ఆదేశించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ వైఎస్ వివేక కుమార్తె సునీతారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరగ్గా, సునీత తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా, అవినాశ్ రెడ్డి తరపున మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఇద్దరి వాదనలు విన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను తప్పుపట్టింది. అవినాశ్ ముందస్తు బెయిల్ ఉత్తర్వులను నిలిపివేసింది. వివేక హత్యకేసు దర్యాప్తు గడువును జూన్-30 వరకు పెంచుతూ ఆదేశాలు జారీ

- మిగతా 2 లో

జీవో 1పై త్వరగా తేల్చండి

హైకోర్టుకు సుప్రీం సూచన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలు ర్యాలీలు, ధర్నాలు జరపడాన్ని నిషేధిస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో 1పై ఏపీ హైకోర్టు త్వరగా విచారణ ముగించి తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించింది. జీవో నెంబర్ 1పై జనవరి 24న విచారణ ముగించిన ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును వాయిదా వేసింది. దీంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టీడీపీ మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారణ జరిపింది. జీవో 1పై ఏపీ హైకోర్టు తీర్పును రిజర్వు చేసి మూడు నెలలు దాటిందని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయపార్టీలపై తీవ్ర ఆంక్షలు పెడుతూ భావ ప్రకటనా స్వేచ్ఛకు ఆటంకాలు కలిగిస్తోందని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇద్దరి వాదనలు విన్న సుప్రీంకోర్టు...దీనిపై ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని ఆశ్రయించాల్సిందిగా పిటిషనర్‌కు సూచించింది.

కదం తొక్కిన రాజధాని రైతులు

- కృష్ణాయపాలెం నుంచి నిడమర్రు వరకు ప్రజా చైతన్య యాత్ర
- అమరావతి విధ్వంసానికి ప్రభుత్వం మరో కుట్ర
- ఆర్-5 జోన్ రద్దు చేసేవరకు ఉద్యమం ఆగదని హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్‌ను విధ్వంసం చేసే కుట్రతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్-5 జోన్‌పై రాజధాని అమరావతి ప్రాంత రైతులు తమ పోరాటాన్ని ఉధృతం చేశారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఆర్-5 జోన్ పరిధి ప్రాంతాల్లో సోమవారం రైతులు పెద్ద సంఖ్యలో 'ప్రజాచైతన్య పాదయాత్ర' చేపట్టారు. కృష్ణాయపాలెం గ్రామంలోని అమరావతి రాజధాని దీక్షా శిబిరం నుంచి ఈ యాత్ర ప్రారంభం కాగా, మహిళలు, వృద్ధులు, పిల్లలు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల పరిధిలోని మందడం, అయినపోలు, కురగల్లు, నిడమర్రు గ్రామం వరకు పాదయాత్ర కొనసాగింది. అనంతరం నిడమర్రు గ్రామ లైబ్రరీ సెంటర్‌లో ముగింపు సభ నిర్వహించారు. ఆర్-5 జోన్ ఏర్పాటుతో ఇతర ప్రాంతాల్లో నివసించే పేదలకు రాజధాని ప్రాంతంలో సెంటు స్థలం చొప్పున సుమారు 54 వేల మందికి

- మిగతా 2 లో

ఒక్కటవుదాం
బీజేపీని ఓడిద్దాం

మమత, అఖిలేశ్‌తో నితీశ్, తేజస్వి భేటీ

2లో

వడగాలుల నుంచి వారం ఉపశమనమే

26 నుంచి దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు : ఐఎండీ

న్యూఢిల్లీ: ఈ నెలాఖరు వరకు భారతదేశంలోని చాలా ప్రాంతాలకు వడ గాలుల పరిస్థితులు తిరిగి వచ్చే అవకాశం లేదు. శుక్రవారం నుంచి దేశ వాయువ్య ప్రాంతంలో తాజాగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తెలిపింది. వాయువ్య, మధ్య, తూర్పు భారతదేశంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం 36, 39 డిగ్రీల సెల్సియస్ మధ్య ఊగిసలాడుతుండగా, ఇది 15, 25 డిగ్రీల సెల్సియస్ మధ్య స్థిరపడిన పశ్చిమ హిమాలయ ప్రాంతాన్ని మినహాయించి దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో ఇది 30, 35 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. 'రాబోయే ఏడు రోజుల్లో దేశంలో ఎలాంటి వడగాలులు ఉండే అవకాశం లేదు' అని పేర్కొంది. ఏప్రిల్ 26 నుంచి పశ్చిమ హిమాలయ ప్రాంతంలో,

- మిగతా 2 లో

వైఎస్ షర్మిల అరెస్టు

లోటస్‌పాండ్ వద్ద తోపులాట

హైదరాబాద్: వైఎస్ఆర్‌టీపీ చీఫ్ వైఎస్ షర్మిలను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రవీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా షర్మిలను అరెస్ట్ చేశారు. షర్మిల కారుతో ఢీ కొనడంతో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయని పోలీసులు చెబుతున్నారు. పోలీసులపై దాడి చేసి కారుతో ఢీకొట్టిన కేసులో వైఎస్ షర్మిలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రవీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్ షర్మిలపై నాలుగు సెక్షన్ల

- మిగతా 2 లో

బీజేపీ మత విద్వేషాలు

- నియంత పాలన దిశగా దేశం
- రాఘవులు, రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-మంగళగిరి/తాడేపల్లి: అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మత వైషమ్యాలతో మతసామరస్యాన్ని నాశనం చేస్తున్నదని మండిపడ్డారు. సీపీఐ, సీపీఎం ప్రచారభేరి బహిరంగ సభ గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం సాయంత్రం జరిగింది. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి

- మిగతా 2 లో

మోదీ నిధి మస్కా...!

- ప్రభుత్వ సంస్థల నిధులు తన ఖాతాలోకి
- మరింత వివాదాస్పదంగా పీఎం కేర్స్ నిధి
- ఇప్పటికే రూ.2,913 కోట్లు పక్కదారి
- ఆరోపణలు... విమర్శలనూ పట్టించుకోని ప్రధాని

> దేశ ప్రజల సొమ్ము పక్కదారి పడుతుందా? ఎక్కడి సొమ్ము ఎక్కడికి వెళుతుంది... అది ప్రజాప్రయోజనార్థమే జరుగుతుందా... పీఎం కేర్ ఫండ్‌కు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి. ఇది ఇప్పుడు కేంద్రంలోని నిరంకుశ బీజేపీ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో జరుగుతున్న విస్తృత చర్చ. ప్రధాన మంత్రిగా మోదీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి దేశంలో ఆర్థిక అస్తవ్యస్త విధానాలకు అంతేలేకుండా పోయింది. నోట్ల రద్దు నుంచి పీఎస్‌యూల ప్రైవేటీకరణ, బ్యాంకుల విలీనీకరణ, అంతర్జాతీయ పరిస్థితులకు భిన్నంగా పెట్రో ఉత్పత్తుల ధరల పెంపు వంటి అనేక ఇతర ఆర్థిక విధానాలు ప్రజలను అతలాకుతలం చేశాయి... చేస్తున్నాయి. అయితే మోదీ పీఎం కేర్స్ ఫండ్‌కు ప్రభుత్వ సంస్థల నుంచి రూ.2,913 కోట్లు అందినట్లు తాజా నివేదిక ఒకటి ప్రజలు విస్తుపోయే విషయాలను వెల్లడించింది.

న్యూఢిల్లీ: పీఎం కేర్ ఫండ్‌కు 2019-20, 2021-22 మధ్య ప్రభుత్వ ఆధీనంలోని జాబితా సంస్థలు కనీసం రూ.2,913.6 కోట్లు విరాళంగా అందించాయని ఒక ఆంగ్ల వార్తా పత్రిక కథనం పేర్కొంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోని జాబితా అయిన అన్ని కంపెనీల వివరాలను సేకరించి ఈ విశ్లేషణ చేసింది. అవసరమైన వారికి మరిన్ని వనరులను అందించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మార్చి 27, 2020న అత్యవసర పరిస్థితుల్లో ప్రధాన మంత్రి పౌర సహాయ, ఉపశమన నిధి (పీఎం కేర్స్) సృష్టిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సంస్థలు, వ్యక్తుల నుంచి విరాళాలను కోరారు. ఇప్పటికే పీఎం కేర్స్ నిధి స్వభావంపై అనేకమంది నాయకులు, కార్యకర్తలు పదే పదే ప్రశ్నలు లేవనెత్తారు. ఇది ప్రైవేట్ ఫండ్ లేదా ప్రభుత్వానిదా? ప్రభుత్వమే అస్పష్టంగా ఉన్నట్లు పత్రాలు వెల్లడిస్తున్నాయి. అయితే అత్యంత ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే, ప్రధాన మంత్రి మోదీ అధ్వర్యంలో నడుస్తున్న ఈ ప్రైవేటు నిధికి ఇప్పటికే ప్రభుత్వ అధ్వర్యంలో నడిచే సంస్థలు 59.3 శాతం విరాళాలను అందజేశాయి. కాగా పీఎం కేర్స్ ఒక 'ప్రభుత్వ సంస్థ' నిధి కాదని జనవరిలో ఢిల్లీ హైకోర్టుకు ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) తెలిపింది. ఈ నిధికి 247 ఇతర సంస్థలు చేసిన సంచిత విరాళం కంటే వారి సహకారం ఎక్కువ... మొత్తం విరాళం రూ.4,910.5 కోట్లలో 59.3 శాతం అని వార్తాపత్రిక నివేదించింది. మొదటి ఐదు ప్రముఖ దాతలలో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (రూ.370 కోట్లు), ఎన్‌టీపీసీ (రూ.330 కోట్లు), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (రూ.275 కోట్లు), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (రూ.265 కోట్లు), పవర్ ఫైనాన్స్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎష్, జగనన్నే నా భవిష్యత్తు!

రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్

3లో

నిరసనలతో దద్దరిల్లిన స్వీడన్

స్టాక్‌హోమ్: స్వీడన్ నగరాలు నిరసనలతో దద్దరిల్లాయి. అంతర్జాతీయ సైనిక విన్యాసానికి ఆతిథ్యం ఇవ్వడం, నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో)లో సభ్యత్వానికి వెంపర్లాడుతున్న ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 17 నగరాల్లో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. నాటో అమెరికా యుద్ధ తంత్రం అంటూ ప్రజలు నినదించారు. తమ దేశం సైనిక కూటమిలో చేరడాన్ని తీవ్రంగా నిరసించారు. నాటో రక్షణాత్మక కూటమి కాదు. ఇది అమెరికా తప్పిదాలను సమర్థించే సంస్థ" అంటూ ప్రజలు ప్లకార్డులుచేపట్టి, పెద్దపెద్ద బానర్లతో కదం తొక్కారు. స్వీడిష్ పీస్ అండ్ ఆర్బిట్రేషన్ సొసైటీ, నో నాటో, నో టు న్యూక్లియర్ వెపన్స్ అంటూ రాజకీయ పార్టీలు వంటి అనేక సంస్థలు, నెట్‌వర్క్‌లు ఈ ప్రదర్శనచేపట్టాయి. ఒక్క స్టాక్‌హోమ్‌లోనే వందలాది మంది నిరసనలో పాల్గొన్నారు. "నాటో వద్దు", "నాటో యుద్ధం ఒక డాలర్ కోసం మా పిల్లలను చంపేస్తుంది" "స్టాప్ అరోరా 23" వంటి సందేశాలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్‌లతో సుమారు 26,000 మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడు క్రిస్టర్ హెరాల్క్, స్వీడన్ తటస్థంగా ఉంటే మంచిదని చైనా వార్తాపత్రిక జిన్హువాతో అన్నారు. "మనం తటస్థంగా ఉంటే స్వీడిష్ సమాజం, ప్రజాస్వామ్యం, సంస్కృతి అభివృద్ధికి మంచిది. నాటో ఒక యుద్ధ కూటమి అని హెరాల్క్ అన్నారు. "నాటో సభ్యుడిగా ఉంటే స్వీడిష్ పన్ను చెల్లింపుదారులకు కూడా చాలా ఖర్చు అవుతుంది, ఎందుకంటే విద్యా వ్యవస్థ, ఆరోగ్య సంరక్షణకు నిధులు తగ్గించేటప్పుడు రక్షణ బడ్జెట్ రెట్టింపు అవుతుంది" అని హెరాల్క్ చెప్పారు. స్వీడన్ నాటో సభ్యదేశంగా మారితే అణ్వాయుధాలు స్వీడన్ భూభాగంలో నిల్వ చేస్తారనే భయాలను వ్యక్తం చేశారు. "స్వీడన్ సాంప్రదాయకంగా అణు నిరాయుధీకరణ కోసం పని చేస్తుంది," అని హెరాల్క్ చెప్పారు, స్వీడన్ నాటో సభ్యునిగా మారితే"రాజకీయ నాయకులు తమ స్థానాన్ని పునఃపరిశీలించవలసి ఉంటుంది." మెజారిటీ స్వీడన్లు నాటోలో చేరేందుకు ప్రతికూలత వ్యక్తంచేశారు. చాలా మంది స్వీడన్లు తమ దేశం సైనిక కూటమిలో సభ్యుడిగా ఉండటం వల్ల కలిగే ప్రతికూల పరిణామాలపై ఆందోళన చెందుతున్నారు. మార్చి, 22న, స్వీడిష్ పార్లమెంట్, రిక్స్‌డాగెన్, నాటోలో చేరడానికి అనుకూలంగా ఓటు వేసింది. స్వీడన్ నాటోలో సభ్యుడిగా మారే అవకాశం ఉన్నప్పటికీ, స్వీడన్ సభ్యత్వానికి వ్యతిరేకంగా ప్రచారం ఆగదని హెరాల్క్ చెప్పారు."మేము దానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాం. స్వీడన్ నాటో సభ్య దేశంగా మారితే, మేము వేర్పాటు కోసం ప్రయత్నిస్తాము" అని హెరాల్క్ చెప్పారు.

దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు నాయకుడు
క్రిస్ మత్లాకోకు ఘన నివాళి

జోహాన్స్‌బర్గ్: దక్షిణాఫ్రికా కమ్యూనిస్ట్ పార్టీ (ఎస్ఏసీపీ) నాయకుడు, ఉద్యమకారుడు క్రిస్ మత్లాకో ఏప్రిల్ 20న మృతిచెందారు. ఆయన మృతికి ఎస్ఏసీపీ ఘన నివాళి అర్పించింది. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఉన్నతమైన సేవలందించిన మత్లాకోకి 15వ జాతీయ కాంగ్రెస్ సెంట్రల్ కమిటీ తన ప్రగాఢ సంతాప సందేశాన్ని తెలియజేసింది. మత్లాకో తన తుది శ్వాస విడిచే వరకు ప్రపంచవ్యాప్తంగా శ్రామిక-వర్గం తరఫున ఎన్నో పోరాటాలు చేశారు. 13-16 జూలై 2022లో జరిగిన ఎస్ఏసీపీ 15వ జాతీయ కాంగ్రెస్‌లో సెంట్రల్ కమిటీ మెంబర్‌గా క్రిస్ మత్లాకో ఎన్నికయ్యారు.. ఆయన పార్టీలో అంతర్జాతీయ సంబంధాల కార్యదర్శిగా పనిచేశాడు. 2017లో 14వ జాతీయ కాంగ్రెస్ ద్వారా ఎన్నుకోబడిన మత్లాకో 2వ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. ఆ పదవీకాలానికి ముందు కేంద్ర కమిటీ సభ్యునిగా పనిచేశారు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ సభ్యుడు, కార్యకర్త, నాయకుడిగా మత్లాకో సామూహిక ప్రజాస్వామ్య ఉద్యమంలో పనిచేశారు. విద్యార్థిగా మత్లాకో దక్షిణాఫ్రికా విముక్తి పోరాటంలో చేరారు, వర్ణవివక్ష వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడేందుకు విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తరువాత ఎస్ఏసీపీలో చేరారు. సామ్యవాద సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న తెలివైన మేధావి, క్రిస్ విప్లవానికి సంబంధించిన అనేక విషయాలపై స్థానిక, అంతర్జాతీయ అంశాలపై వివిధ ప్రచురణల కోసం అనేక వ్యాసాలను రాశారు. సంవత్సరాలుగా వివిధ ప్రచురణలలో ప్రచురించబడిన ఆయన వ్యాసాల సంకలనం థింకింగ్ చే అనే పత్రికలో సీరియల్‌గా ప్రచురించడమైంది. దక్షిణాఫ్రికా శ్రామిక-వర్గానికి సేవ చేయడానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ వ్యవస్థను నిరసిస్తూ మత్లాకో అంతర్జాతీయంగా పోరాటం చేశారు. అంతర్జాతీయవాద పనిలో భాగంగా, కామ్రేడ్ క్రిస్ ఫ్రెండ్స్ ఆఫ్ క్యూబా సొసైటీ - సౌత్ ఆఫ్రికా జనరల్ సెక్రటరీగా పనిచేశాడు. అనేక ఇతర బాధ్యతలతో పాటు సౌత్ ఆఫ్రికా పీస్ ఇనిషియేటివ్‌లో సభ్యుడు కూడా.

వడగాలుల నుంచి వారం ఉపశమనమే

(మొదటిపేజీ తరువాయి)

ఏప్రిల్ 28 నుంచి వాయువ్య మైదానాలలో తాజాగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అలాగే ఏప్రిల్ 25 నుంచి 27 వరకు మధ్య మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లోని దక్షిణ జిల్లాలపై తాజా ఉరుములు లేదా వడగళ్ల వానలను అంచనా వేసింది. తమిళనాడు, కేరళలో వచ్చే 3 నుంచి 4 రోజుల వరకు ఉరుములు లేదా వర్షం కురుస్తుందని తెలిపింది. ఏప్రిల్ 24న కోస్తా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో, అలాగే అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయలలో ఏప్రిల్ 28న, కేరళలో ఏప్రిల్ 24 నుంచి 27 వరకు, తెలంగాణలో ఏప్రిల్ 27న భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఏప్రిల్ 24-26 వరకు తెలంగాణ, ఏప్రిల్ 25-27 మధ్య మహారాష్ట్ర, ఏప్రిల్ 25-26 మధ్య దక్షిణ చత్తీస్‌గఢ్, ఏప్రిల్ 26న తూర్పు మధ్యప్రదేశ్‌లో వడగళ్ల వానలు కూడా సంభవించవచ్చని ఐఎండీ అంచనా వేసింది.

అవినాశ్‌కు చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. ఈ నెల 25 వరకు అరెస్ట్ చేయకుండా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని అవినాశ్ తరపు న్యాయవాది కోరగా... అలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అవినాశ్ విచారణకుగాను లిఖితపూర్వక ప్రశ్నలు ఇవ్వాలని సీబీఐని హైకోర్టు ఆదేశించడాన్ని తప్పుబట్టింది. అయినా సీబీఐ అరెస్ట్ చేస్తుందని ఎందుకు ఊహించుకుంటున్నారని అవినాశ్ తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. సీబీఐ అరెస్ట్ చేయదలుచుకుంటే ఎప్పుడో చేసేది కదా అని వ్యాఖ్యానించింది. ఈ కేసులో సీబీఐ ఇప్పటివరకు పూర్తి సంయమనంతో ఉందని కోర్టు అభిప్రాయపడింది. ముందస్తు బెయిల్ సంగతేంటో తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం స్పష్టం చేసింది. అవినాశ్ విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు తప్పుడు సంప్రదాయానికి దారితీసేలా ఉన్నాయని, దర్యాప్తును ప్రభావితం చేసేలా ఉన్నాయని సీజేఐ ధర్మాసనం పేర్కొంది.

వైఎస్ షర్మిల అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఐపీసీ 332, 353, 509, 427 సెక్షన్ల కింద వైఎస్ షర్మిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్ షర్మిలపై బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముందు జాగ్రత్తగా ఆమెను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుండి వైఎస్ షర్మిలను కోర్టుకు తరలించనున్నారు. కోర్టుకు తరలించడానికి ముందు వైఎస్ షర్మిలను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో సిట్ అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు బయలు దేరిన షర్మిలను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. ఉదయం 10:30 గంటలకు లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి షర్మిల బయలుదేరు తుండగా పోలీసులు ఒక్కసారిగా పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. బయటకు వెళ్లేందుకు అనుమతిలేదని ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే షర్మిల పోలీసులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా పోలీసులు వినిపించుకోలేదు. లోటస్ పాండ్ వద్ద షర్మిల కారు ఎక్కే సమయంలో అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులపై షర్మిల చేయి చేసుకున్నారు. ఈ క్రమంలో షర్మిలకు పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు అడ్డుకోవడంతో షర్మిల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అయితే షర్మిల పోలీసులతో దురుసుగా ప్రవర్తించారని, ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌పై ఆమె చేయిచేసుకున్నారని పోలీసులు చెబుతున్నారు. షర్మిల అరెస్టుపై డీసీపీ జోయల్ డేవిస్ స్పందించారు. పోలీసులపై షర్మిల దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. షర్మిల సిట్ ఆఫీసుకు వెళ్తారనే సమాచారం ఉందని.. అందుకే ఆమెను ముందస్తుగా అరెస్టు చేయడానికి ప్రయత్నించామని వివరించారు. పోలీసుల ఫిర్యాదు మేరకు షర్మిలపై కేసు పెడతామని తెలిపారు. ఎస్సై ఫిర్యాదు ఆధారంగా షర్మిల కేసులో ముందుకెళ్తామని సీపీ ఆనంద్ వెల్లడించారు. కాగా ఈ ఘటనపై వైఎస్సార్‌టీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు.

ఒంటరిగానే వెళ్లాలనుకున్నా: షర్మిల

సిట్ కార్యాలయానికి తాను ఒక్కదాన్నే వెళ్లాలని అనుకున్నానని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల వెల్లడించారు. సిట్ అధికారిని కలిసి టీఎస్‌పీఎస్సీ దర్యాప్తు మీద వినతి పత్రం ఇవ్వాలని అనుకున్నానని తెలిపారు. కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడు తమ అనుమానాలను అధికారికి చెప్పడం బాధ్యతగా భావించానని అన్నారు. సిట్ ఆఫీస్ కి వెళ్లడానికిఎవరికీ చెప్పి వెళ్లాల్సిన అవసరం లేదని షర్మిల తెలిపారు.

ఒక్కటవుదాం... బీజేపీని ఓడిద్దాం

కోల్‌కతా/లక్నో: కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి గద్దె దించడం కోసం ఏకతాటిపైకి రావాలని ప్రతిపక్షాలన్నీ కోరుకుంటున్నాయి. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే దేశ భవిష్యత్ అంధకారంలో పడుతుందని దాదాపు అన్ని ప్రతిపక్షాలు బలంగా నమ్ముతున్నాయి. కమలనాథుల నియంతృత్వ, ఏకపక్ష నిర్ణయాలపై వామపక్షాలు మొదటి నుంచి గళం వినిపిస్తున్నాయి. వాస్తవంగా బీజేపీని అధికారం నుంచి దించాలని ఎవరికి వారు చెబుతున్నారుగానీ...అన్ని పార్టీలను ఏకం చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో తాజాగా బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ రంగంలోకి దిగారు. బీజేపీ యేతర పార్టీలతో వరుసగా మంతనాలు సాగిస్తున్నారు. తాజాగా నితీశ్ కుమార్, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ సోమవారం కోల్‌కతాలో టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీతో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. 2024 లోక్‌సభ ఎన్నికల వేళ విపక్షాల ఐక్యత చాటాలని నిర్ణయించారు. సమావేశానంతరం ముగ్గురూ కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ మధ్య చర్చలు సానుకూలంగా సాగాయని నితీశ్ చెప్పారు. బీజేపీది ప్రచారమే తప్ప దేశాభివృద్ధి కోసం చేసిందేమీ లేదని విమర్శించారు. విపక్ష నేతలంతా కలిసి కూర్చుని వ్యూహాలు రూపొందిస్తే బాగుంటుందని మమత చెప్పారు. బీజేపీని జీరో చేయడమే తమ లక్ష్యమన్నారు. బీహార్‌లోనే నాడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం ప్రారంభమైందని, ఇప్పుడు కూడా ప్రతిపక్షాలకు సంబంధించి అఖిలపక్ష సమావేశం బీహార్‌లో నిర్వహిస్తే బాగుంటుందని మమత సూచించారు. కాగా, మమతతో చర్చలు జరిపిన అనంతరం కోల్‌కతా నుంచి నేరుగా లక్నో వచ్చిన నితీశ్, తేజస్వికి సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ పుష్పగుచ్ఛాలిచ్చి సాదరంగా స్వాగతం పలికారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాల ఐక్యత ఆవశ్యకతపై ముగ్గురు నేతలూ చర్చించారు. ప్రతిపక్షాలకు కాంగ్రెస్ నేతృత్వం అనే విషయంపైనా చర్చించినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై అఖిలేశ్ గతంలోనే స్పష్టత ఇచ్చారు. ప్రాంతీయ పార్టీలతో కలిసి పనిచేసేందుకు కాంగ్రెస్ సిద్ధపడాలన్నారు. నేతృత్వం ఎవరిదనేది పక్కన పెట్టి విపక్షాలన్నీ ఐక్యంగా ఉండాలని, అప్పుడే బలమైన బీజేపీని ఢీ కొట్టగలమని చర్చించినట్లు తెలిసింది.

బీహార్‌లో కాంగ్రెస్-ఆర్జేడీ-జేడీయూ పొత్తులో సంకీర్ణ ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. దీంతో నితీశ్ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ సారథ్యంలో విపక్షాలు ఏకం కావాలని పిలుపునిస్తున్నారు. అయితే చాలాపార్టీలు కాంగ్రెస్ నేతృత్వాన్ని ఇష్టపడటం లేదు. మమత స్వయంగా పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌కు ఉనికి లేకుండా చేశారు. ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ, సీపీఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారని, లోక్‌సభ ఎన్నికల్లో తాను కాంగ్రెస్‌తో చేతులు కలపబోనని స్పష్టం చేశారు. నితీశ్ ఏప్రిల్ 12న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను కలిశారు. కేంద్రంలో బలంగా ఉన్న నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలువరించాలంటే ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని చర్చించారు. ప్రతిపక్షాలు కలిసి కట్టుగా ఉంటూ కేంద్రం నుంచి మోదీ సర్కారును సాగనంపాలని నిర్ణయించినట్లు సమావేశానంతరం కేజ్రీవాల్, నితీశ్ చెప్పారు. అయితే ఆ తర్వాత వారం రోజుల వ్యవధిలోనే తాము 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ ప్రకటించింది. ప్రధాని అభ్యర్థి ఎవరనేది ప్రజలనే నిర్ణయించాలని ఆప్ సూచించింది. కేజ్రీవాల్ మొదటు నుంచీ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి ధీటైన జాతీయ ప్రత్యామ్నాయం ఆమ్ ఆద్మీ పార్టీదేనని కేజ్రీవాల్ విశ్వసిస్తున్నారు. ఇదే విషయాన్ని ఆయన అనేక వేదికలపై ప్రకటించారు. ఇప్పటికే ఆప్ ఢిల్లీ, పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించింది. గోవా, గుజరాత్‌లో ఉనికి చాటుకుని జాతీయ పార్టీ హోదా సాధించింది.

కేజ్రీవాల్‌ను కలిసే ముందు నితీశ్, తేజస్వీయాదవ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గేను ఢిల్లీలో కలిశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వారికి స్వాగతం పలికారు. అనంతరం అందరూ గ్రూప్ ఫొటోలు దిగారు. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల కోసం ప్రతిపక్షాల మధ్య ఐక్యతను సాధించడంపై చర్చించారు. కాంగ్రెస్ అనుకూల పార్టీలతో పాటు కాంగ్రెసేతర పార్టీలను కూడా సంప్రదించాలని నిర్ణయించారు. ప్రధాని అభ్యర్థి ఎవరనేదానికన్నా ప్రతిపక్షాలన్నింటినీ ఒకేతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా చర్చలు సాగాయి. 2024 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి నితీశేనని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాహుల్ ప్రధాని అభ్యర్థిత్వానికి మద్దతు ఇచ్చారు. తర్వాత రాహుల్‌పై అనర్హత వేటు పడటంతో కాంగ్రెస్ తరపున ప్రధాని అభ్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వాన్ని ఇష్టపడని అనేక పార్టీలున్నాయి. కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే యూపీఏలో కొనసాగుతున్నాయి. ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన ఇప్పటికే కాంగ్రెస్ కూటమిలోనే ఉన్నాయి. స్టాలిన్ కూడా యూపీఏ భాగస్వామిగానే ఉన్నారు. బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ అన్ని కూటములకూ దూరంగా ఉన్నారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వైఖరి ఈ ఏడాది ఆఖరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చే ఫలితాల ఆధారంగా స్పష్టమౌతుంది. అదానీ అంశం ప్రజాసమస్య కాదని, అదానీ చేసిన మేలును గుర్తించాలని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించడంతో ప్రతిపక్షాలు అయోమయంలో పడ్డాయి. ప్రధాని విద్యార్హత అంశం కూడా ప్రజా సమస్య కాదని పవార్ చెప్పడంతో ప్రతిపక్షాల్లో ఐక్యత లేదనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయి. దీంతో పరిస్థితిని చక్కబెట్టేందుకు కాంగ్రెస్ నేతలు వెనువెంటనే నితీశ్‌ను తెరపైకి తీసుకువచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలంటే 543 నియోజకవర్గాల్లోనూ ప్రతిపక్షాల తరపున ఒక్క అభ్యర్థే ఉండాలని నితీశ్ చెప్పినట్లు తెలిసింది. ఇదే జరిగితే బీజేపీ వ్యతిరేక ఓటు చీలిపోకుండా ఉంటుందని, బీజేపీ అభ్యర్థులను ఓడించడం సులభమౌతుందని రాహుల్, ఖడ్గేలకు నితీశ్ వివరించారు. మొత్తం మీద నితీశ్ యత్నాలకు మమత, అఖిలేశ్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

కదం తొక్కిన రాజధాని రైతులు

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అత్యంత వివాదాస్పద జీవో 45 తీసుకొచ్చింది. కృష్ణాయ పాలెం, వెంకటపాలెం, నిడమర్రు, ఐనవోలు, మందడం గ్రామాల పరిధిని ఆర్-5 జోన్‌గా ప్రకటించి 1134.58 ఎకరాలు పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించనున్నట్లు ఈ జీవోలో పేర్కొన్నారు. అలాగే భవిష్యత్ అవసరాలు నిమిత్తం మాస్టర్ ప్లాన్‌లో ఉంచిన భూములను నవులూరులో 60 ఎకరాలు, ఎర్రబాలెంలో 150 ఎకరాలు, కురగల్లులో 60 ఎకరాలు అదనంగా నవరత్నాలు పథకంలో భాగంగా పేదల ఇళ్లకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టింది. దీనిపై గతంలో రైతులు హైకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వ తీరును ఆక్షేపించింది. అయినప్పటికీ ప్రభుత్వం తన పంతం నెగ్గించుకునేందుకు మరోసారి ముందడుగు వేయడంతో మళ్లీ రైతులు కోర్టును ఆశ్రయించారు. రెండు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఇటీవల తీర్పు రిజర్వు చేసింది. దీంతో ప్రభుత్వం జంగిల్ క్లియరెన్స్ పేరుతో పొక్లెయిన్లను తీసుకొచ్చి రాజధాని భూముల చదును పేరుతో హడావుడి చేస్తోంది. పేదల పేరుతో పట్టాలిచ్చేందుకు కూడా శరవేగంగా ఏర్పాట్లు చేపడుతోంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి నాయకులు పువ్వాడ సుధాకర్, పోతుల బాలకోటయ్య, రామారావు, చిలకా బసవయ్య తదితరులు మాట్లాడుతూ ఆర్-5 జోన్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం అమరావతి విధ్వంసానికి చేస్తున్న మరొక కుట్రగా పేర్కొన్నారు. రైతులతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఏమిటి? ప్రస్తుతం చేస్తున్నదేమిటి? చేతిలో అధికారం ఉందని, ఇలా దౌర్జన్యంగా రైతులు ఇచ్చిన భూములను పప్పుబెల్లాల్లా పంచి, రాజధాని మాస్టర్‌ప్లాన్‌ను చెడగొట్టడం, పేదల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడం పాలక పెద్దలకు తగునా? అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదలంటే ప్రభుత్వానికి అంత ప్రేమ ఉంటే భూములిచ్చిన రైతులకు కౌలు సక్రమంగా ఎందుకివ్వడం లేదు? వ్యవసాయ కూలీలకు పెన్షన్లు సక్రమంగా ఎందుకు చెల్లించడం లేదు? రైతులకిచ్చిన ప్లాట్లను ఎందుకు అభివృద్ధి చేయడం లేదని వారు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. అలాగే పేదల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాజధాని ప్రాంతంలో పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన సుమారు 5 వేలకు పైగా నిర్మించిన టిడ్కో ఇళ్లు గత నాలుగు సంవత్సరాలుగా లబ్ధిదారులకు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కేవలం పేదల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికే ఆర్-5 జోన్ ఏర్పాటు చేశారని వారు విమర్శించారు. న్యాయస్థానంలో దీనిపై విచారణ సాగుతున్నప్పటికీ ప్రభుత్వం దూకుడుగా వెళ్లడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆర్-5 జోన్‌ను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఐకాస నేతలు హెచ్చరించారు.

బీజేపీ మత విద్వేషాలు

(మొదటిపేజీ తరువాయి)

చిన్ని తిరుపతయ్య, సీపీఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వై.కమలాకర్ అధ్యక్షత వహించారు. బీవీ రాఘవులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, మతసామరస్యం, సమాఖ్య స్ఫూర్తిని బీజేపీ దెబ్బతీస్తోందని మండిపడ్డారు. సీబీఐ, ఈడీ దాడులతో ప్రతిపక్షాల నోరు నొక్కుతోందని ఆరోపించారు. దేశ సంపదను కొద్దిమంది కుబేరులకు దోచిపెడుతోందన్నారు. ఇటువంటి బీజేపీ 2024లో తిరిగి అధికారం చేపడితే దేశ ఐక్యతను కాపాడటం కష్టతరమవుతుందని రాఘవులు హెచ్చరించారు. ఎన్నికలు కూడా ఉండవని, నియంతృత్వం రాజ్యమేలుతుందని చెప్పారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తోందని, ఇది సరైన విధానం కాదన్నారు. దేశంలో ప్రతిపక్షాలు ఉండకూడదని బీజేపీ కోరుకుంటుందని, ప్రతిపక్షాలు ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుందన్న విషయాన్ని బీజేపీ గ్రహించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధులు, విశాఖ ఉక్కు తదితర విషయాల్లో రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీని ఎట్టిపరిస్థితుల్లోనూ క్షమించకూడదని విజ్ఞప్తి చేశారు. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీ విషకౌగిలి నుంచి బయటపడాలని హితవు పలికారు. బీజేపీ పక్షాన ఉండాల్లో...రాష్ట్ర ప్రజల పక్షాన ఉండాలో తేల్చుకోవాలని ఆ పార్టీలకు సూచించారు.

రామకృష్ణ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో బీజేపీ ప్రభుత్వం దేశానికి ఏమి చేసిందని ప్రశ్నించారు. ప్రజల మధ్య చీలిక తేవడం, హిందూ మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకోవడం తప్ప ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ధరల తగ్గింపు, ఉద్యోగాల సృష్టి, రైతు ఆదాయం రెట్టింపు, వెనక్కి తెస్తామన్న నల్లధనం హామీలు అమలు చేయలేదని గుర్తు చేశారు. మోదీ అధికారం చేపట్టే నాటికి దేశానికి రూ.47 లక్షల కోట్ల అప్పు ఉంటే నేడు రూ.150 లక్షల కోట్లకు పెరిగిందని విమర్శించారు. బ్యాంకులకు లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన బడాబాబులపై ప్రధాని మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఏమి చర్యలు తీసుకున్నారని రామకృష్ణ నిలదీశారు. మోదీ హయాంలో అత్యంత దారిద్ర్య దేశంగా భారత్ నిలిచిందని ఆరోపించారు. అదానీ ఆర్థిక కుంభకోణాలపై జేపీసీ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. నాలుగేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందని విమర్శించారు. లక్షల కోట్లు అప్పు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు నిర్మించలేదని, పరిశ్రమ స్థాపించలేదని, పైగా రాజకీయ కక్ష సాధింపుతో ఉన్న పరిశ్రమలను పారిపోయేలా చేస్తోందని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. లౌకిక, ప్రజాతంత్రశక్తులు ఒకే వేదికపైకి వచ్చి బీజేపీ, వైసీపీని గద్దెదించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వాక్ స్వాతంత్ర్యం కోసం ఉద్యమాన్ని బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీకి రాజధాని లేకుండా చేశాయని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశ ఆర్థిక, పారిశ్రామిక, రాజకీయ రంగాలను నాశనం చేస్తున్న తరుణంలో మరో స్వాతంత్ర్య ఉద్యమానికి సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో కమ్యూనిస్టుల అధ్వర్యంలో సాధించుకున్న భూములలో నివాసం ఉంటున్న పదివేల మంది పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తొలిత సీపీఎం మైనార్టీ నాయకులు షంషేర్ ఖాన్‌కు నివాళులర్పించారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య ఆహ్వానం పలకగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.చెంగయ్య వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జాలాది జాన్‌బాబు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, బొర్రా మల్లికార్జునరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, సీపీఎం నాయకులు ఎం.రవి, ఈమని అప్పారావు, జేవీ రాఘవులు, జవహర్, జొన్నా శివశంకర్, బాలరాజు, జి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పైగంబర కవి కమలాకాంత్ మృతి



ముంబై: ఐదుగురు పైగంబర కవుల్లో ఒకరైన కమలాకాంత్ కన్ను మూశారు. కమలాకాంత్ గురించి ఈతరం వారికి పెద్దగా తెలీదు. నిజానికి కమలా కాంత్ పైగంబరుడిగా అవతారమెత్తక ముందు నుంచే మంచి కథకుడు.చాలా గొప్ప కథలు రాశారు.కానీ లోకానికిమాత్రం ఆయన పైగంబరకవిగానే తెలుసు. పైగంబర కవిత్వం మాత్రమే గాక ఆయనరాసిన కవిత్వం 'అసమబాహు త్రిభుజం' పేరుతో కవితా సంపుటిగా వచ్చింది. ఆయన భార్య ఆరుమాసాల క్రితం మృతిచెందారు. కమలా కాంత్ గురువారం తుదిశ్వాసవిడిచారు. పైగంబర కవిత్వం రాశాక ఉద్యోగరీత్యా కమలాకాంత్ బొంబాయికి బదిలీ అయ్యారు. అప్పటినుండి తెలుగు నేలకు, కవిత్వానికి దూరంగా వుంటున్నారు. అయితే 50 ఏళ్ల తర్వాత ఆయన కథల్ని, కవిత్వాన్ని కలిపి 'కెంపులూ..మందారాలు' పేరుతో ఓ బృహత్ సంపుటి తెచ్చారు. ఇందులో 1960 నుంచి 1974 వరకు ఆయన రాసిన మొత్తం 23కథలు, అసమ బాహు త్రిభుజం పేరుతో ఆయన కవిత్వమూ వున్నాయి.

మోదీ 'నిధి' మస్కా..!

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్ (రూ.222.4) ఉన్నాయి. లెక్కలు రూపొందించడంలో ప్రభుత్వానికి గణనీయమైన వాటా ఉన్న 57 కంపెనీలను నివేదిక గుర్తించింది. పీఎం కేర్స్ మార్చి 2020లో స్థాపించబడినప్పటి నుంచి వివాదాస్ప దంగా ఉంది. ఎందుకంటే ఇది ప్రజల పరిశీలనకు దూరంగా ఉండటం, చైనా కంపెనీలతో సహా విదేశీ సంస్థల నుంచి నిధులను స్వీకరించడం వంటి కారణాలు ఉన్నాయి. జనవరి 2023లో ఢిల్లీ హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం సమర్పించిన నివేదిక ప్రకారం, ఈ నిధి భారత ప్రభుత్వంచే నియంత్రించబడదు. ఇది 2020లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో పేర్కొన్న స్థితిని పునరుద్ఘా టించింది. ట్రస్ట్ ఎటువంటి ప్రభుత్వ డబ్బును స్వీకరిం చదని పేర్కొంది. పీఎం కేర్స్ వెబ్‌సైట్‌లోని వెల్లడి ప్రకారం, పీఎం కేర్స్ ఫండ్ 2019-20లో రూ.3,076.6 కోట్లు వసూలు చేసింది. ఇది 2020-21లో రూ.10,990.2 కోట్లకు పెరిగింది. 2021-22లో రూ.9,131.9 కోట్లకు పడిపోయింది. కార్పొరేట్ ఇండియా మొదటి సంవత్సరంలో సీఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) బడ్జెట్‌ల నుంచి ఎక్కువ మొత్తం వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నిధి 2019-20లో పని చేసిన కొద్ది రోజుల్లో కేవలం రూ.2,049 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఇది 2020-21లో రూ.3,976.2 కోట్లకు, 2021-22లో రూ.3,716.3 కోట్లకు పెరిగింది. వార్తా పత్రిక కథనం ప్రకారం, సెప్టెంబరు 2022లో ప్రభుత్వం సవరించిన కొత్త నిబంధనల కారణంగా సీఎస్ఆర్ వ్యయంపై పరిశీలనకు ప్రాముఖ్యత పెరిగింది. ఈ సవరించిన నిబంధనలు సీఎస్ఆర్ ఖర్చులపై కంపెనీలు తమ వార్షిక నివేదికలలో ఉంచా ల్సిన సమాచారాన్ని పరిమితం చేస్తాయి. ఇదిలాఉండగా, పీఎం కేర్స్ నిధి స్థితి, దాని స్వభావం, దాని చుట్టూ పారదర్శకత లేకపోవడం వివాదాస్పదమైంది. ఈ ఏడాది ప్రారంభం జనవరిలో ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఢిల్లీ హైకోర్టుకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 ప్రకారం పీఎం కేర్స్ ఫండ్ 'పబ్లిక్ అథారిటీ' కాదని తెలిపింది. అందువల్ల సమాచార హక్కు చట్టం, 2005 ప్రకారం దాని పనితీరు గురించి ప్రజలకు జవాబుదారీ కాదు.

అంతా వివాదాలమయం

పీఎం కేర్స్ ఫండ్‌ను ప్రభుత్వం కార్పొరేట్ విరాళాల ప్రయోజనం కోసం ప్రభుత్వ ట్రస్ట్‌గా నిర్వచించింది. అయితే ట్రస్ట్ పత్రాల్లోని ఒక నిబంధన దీనిని ప్రైవేట్ సంస్థ అని పేర్కొంటోంది. ఇది ఆర్‌టీఐ పరిశీలన నుంచి మినహాయించబడింది. ఇది ప్రైవేట్ లేదా పబ్లిక్ అయినా ఇది ఫండ్ అస్తిత్వంపై ప్రశ్నలను లేవనెత్తింది. ఎన్‌డీటీవీలో ఒక నివేదిక ప్రకారం, పీఎం కేర్స్ ఫండ్ ట్రస్ట్ ఢిల్లీ రెవెన్యూ శాఖలో నమోదయింది. ప్రధాన మంత్రి చైర్‌పర్సన్‌గా, సీనియర్ మంత్రులు ట్రస్టీలుగా ఉన్నారు. అయితే, ఫండ్ వెబ్‌సైట్‌లో ఇటీవల పబ్లిక్ చేసిన ట్రస్ట్ డీడ్ దానిని ప్రభుత్వ ట్రస్ట్‌గా నిర్వచించలేదు. 'ట్రస్ట్ ఉద్దేశించబడింది లేదా వాస్తవానికి ఏదైనా ప్రభుత్వం లేదా ఏదైనా ప్రభుత్వ సాధనం ద్వారా యాజమాన్యం, నియంత్రించబడటం లేదా గణనీయంగా ఆర్థిక సహాయం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం లేదా ఏ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా, పనితీరులో నియంత్రణ లేదు. ఏ పద్ధతిలోనైనా విశ్వాసం' అని డీడ్ పాయింట్ 5.3 చెబుతోంది. కంపెనీల చట్టం కార్పొరేట్ విరాళాలకు అర్హతను ఇలా నిర్వచిస్తుంది... 'షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళల సంక్షేమం కోసం సామాజిక-ఆర్థిక అభివృద్ధి, ఉపశమనం, నిధులు కోసం కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధికి లేదా ఏదైనా ఇతర నిధికి సహకారం'. ఆర్టీఐ ప్రశ్న ద్వారా కార్యకర్త అంజలి భరద్వాజ్ పొందిన పత్రాలు, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మార్చి 28న ఆఫీస్ మెమోరాండం జారీ చేస్తూ, పీఎం కేర్స్ 'కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిధి'గా నిర్వచించిందని ఎన్‌డీటీవీ నివేదించింది. అయితే, ఒక రోజు ముందు నుంచి ట్రస్ట్ డీడ్ ఇది ప్రభుత్వ అధ్వర్యంలోనిది కాదని పేర్కొంది. అందువల్ల పీఎం కేర్స్ కార్పొరేట్ విరాళాలకు అర్హత పొందలేదు.

రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్

విశాలాంధ్ర-పార్వతీపురం: మన్యం జిల్లా డీఈఓ డాక్టరు ఎస్‌డీవీ రమణ, మరో ఆరుగురు ఉద్యోగులపై రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను తక్షణమే రద్దుచేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, వివిధ ప్రజాసంఘాల అధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో మూడువేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీఎస్) పేరుతో నాలుగు రోజులుగా ఆందోళనలు జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ప్రభుత్వానికి, ప్రవీణ్ ప్రకాశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి మెయిన్ రోడ్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాదిమంది ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఎత్తివేసే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు. మహిళా ఉపాధ్యాయులు సైతం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. విద్యావ్యవస్థను దిగజారుస్తూ, ఉపాధ్యాయ లోకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తూ, చేయని నేరాలకు శిక్ష వేయడాన్ని నిరసించారు. జిల్లా విద్యా శాఖాధికారితోపాటు వీరఘట్టం ఎంఈఓ పి.కృష్ణమూర్తి, జిల్లా అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రోజారమణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రోహిణి, సీతమ్మపేట ఎంఈఓ ఆనందరావు, మర్రిపాడు ఎంపీపీ హెచ్‌ఎం రామినాయుడు, భామిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు రాంబాబు సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ ప్రకాశ్‌పై చర్యలు తీసుకోవాలని, గో బ్యాక్ ప్రవీణ్ ప్రకాశ్ అని నినాదాలు చేశారు. నిరసనలో హెచ్‌ఎంల సంఘం, పీఆర్‌టీయూ ఏపీటీఎఫ్, ఏపీటీఎఫ్ 1938, యూటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ సంఘం, వైఎస్సార్ టీచర్స్ యూనియన్, స్టేట్ టీచర్స్ ఫెడరేషన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య, కేజీబీవీ సంఘం, జిల్లా ఎన్‌జీఓ సంఘం నేతలు పీసీహెచ్ శ్రీనివాసరావు, ఇల్లా ప్రసన్న లక్ష్మి, అమరాపు సూర్యనారాయణ, వాలేటి తవిటినాయుడు, కాగాన విజయ్, నల్ల బాలకృష్ణ, బంకురు జోగినాయుడు, రావాడ అప్పలనాయుడు, సుర్ల మురళీ మోహన్, తోట రమేశ్, సీహెచ్ శ్రీనివాసరావు, నీరస శ్రీనివాసరావు, సామల సింహాచలం, రాగాల శ్రీనివాసరావు, బోగి రవి, కోట శ్రీదేవి, దాసరి వెంకటనాయుడు, స్కూల్ అసిస్టెంటుల సంఘం నేత ఉత్తరావిల్లి గోవిందరావు, పీఈటీ సంఘం నేత దామినేని గాంధీ, జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షుడు జీవీఎస్ కిషోర్, మన్యం జిల్లాలోని 15 మండలాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ తరపున జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం రూరల్ డీఎస్పీ ఎ.సుభాశ్ అధ్వర్యాన సీఐ విజయానంద్, ఎస్‌ఐ వై.సింహాచలం, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సొంతంగా అవార్డులా?

రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అవార్డులనేవి సొంతంగా ఇచ్చుకునేవి కాదని, అభివృద్ధిని చూపి సాధించుకునేవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పంచాయతీలకు నిధులు సమకూర్చకుండా కేంద్రం ఇచ్చిన నిధులను జగన్ ప్రభుత్వం లాగేసుకుని, పంచాయతీలకు అవార్డులిచ్చేస్తే సరిపోతుందా అని రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో సూటిగా ప్రశ్నించారు. యేటా కేంద్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ దివస్ నాడు ప్రదానం చేసే అవార్డులలో రాష్ట్రానికి మొండిచేయి ఎదురైంది. తెలంగాణ రాష్ట్రం 10 జాతీయ అవార్డులు దక్కించుకుంది. 2015-2018 మధ్యకాలంలో 89 జాతీయ అవార్డులు దక్కించుకున్న ఆంధ్రప్రదేశ్...తర్వాత కాలంలో జగన్ ప్రభుత్వ వైఖరివల్ల అధ:పాతాళానికి వెళ్లింది. కేంద్రం ప్రకటించిన అవార్డులు రాష్ట్రానికి దక్కకపోవడంతో కంగుతిన్న ప్రభుత్వం హడావుడిగా తొమ్మిది విభాగాల్లో 27 గ్రామ పంచాయతీలకు తానే అవార్డులిచ్చుకునేందుకు సిద్ధమైంది. జగన్ సర్కార్ తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు పంచాయతీలకు అవార్డులిచ్చేందుకు పూనుకోవడం దుర్మార్గం. పంచాయతీ వ్యవస్థను జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీలకు నిధులు సమకూర్చలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించింది. ఫలితంగా పంచాయతీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. తాగునీరు సరఫరా, రోడ్ల మరమ్మతులు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీలకు నిధుల కొరతతో సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళన చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సాక్షాత్తూ వైసీపీ సర్పంచ్‌లే ముఖ్యమంత్రి వైఖరిని తీవ్రంగా తప్పుబడుతున్నారు. సర్పంచ్‌లు తమ చెప్పులతో తాము కొట్టుకొని నిరసనలు తెలియజేసినా రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి రాలేదు. ఇప్పటికైనా పంచాయతీలకు నిధులిచ్చి సర్పంచ్‌ల ఆవేదనను తొలగించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని రామకృష్ణ హితవు పలికారు.

సాహితీ విమర్శకులు బాలశ్రీనివాసమూర్తి మృతి

విశాలాంధ్ర-హైదరాబాద్: సాహితీ విమర్శకులు, తెలంగాణ విశ్వ విద్యాలయం ఆచార్యులు గుమ్మనగారి బాలశ్రీనివాసమూర్తి గుండెపోటుతో సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మంచి వక్త, పరిశోధకులు. ఆయన లేని లోటు తెలుగుసాహిత్యంలో ఎన్నటికీ పూడ్చ లేనిది. తెలంగాణ వైతాళికులు - ప్రతిభామూర్తులు, తెలంగాణ వైతాళికులు - అక్షరమూర్తులు, తెలంగాణ సాహిత్య చరిత్ర - సంప్రదాయ సాహిత్యం ఈ మూడు గ్రంధాలకు ఆయన సంపాదకుడుగా వ్యవహరించారు. వీటిని సుల్తాన్‌బజార్‌లోని నీల్ కమల్ వారు ప్రచురించారు. బాల శ్రీనివాసమూర్తి మృతికి అనేక మంది రచయితలు, కవులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మా డిమాండ్లు పట్టించుకోరా?

సీఎస్‌ను అడిగిన ఏపీ అమరావతి జేఏసీ నేతల బృందం

నేడు వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల ధర్నా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వ జాప్యంతోనే ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తోందని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏపీ జేఏసీ అమరావతి తేల్చిచెప్పింది. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు తదితరులతో కూడిన జేఏసీ బృందం సోమవారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డిని కలిసింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 47 రోజులుగా చేస్తున్న ఉద్యమ పరిస్థితిని వివరించింది. ఈనెల 25న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపైన, 29వ తేదీన గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ధర్నాలు చేస్తామని తెలిపింది. ఈనెల 28న ఏపీ జేఏసీ అమరావతి అధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి...భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించింది. అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికిగాను ఎంతో ఓర్పు, సహనంతో దశలవారీగా ధర్మ పోరాటాలు, నిరసనలు కొనసాగిస్తున్నామన్నారు. అయినా ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్, ఏపీజీఎల్‌ఐ నిధులు ఎంత వాడుకున్నదీ ప్రభుత్వం చెప్పడం లేదన్నారు. ఉద్యోగులకు ఎన్నికోట్ల రూపాయలు చెల్లించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలతోపాటు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేదన్నారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలోను ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సీఎస్‌ను కలిసిన వారిలో ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడు, ఎస్.శ్రీనివాసరావు, కె.సుమన్, అల్లం సురేశ్, ఎ.సాంబశివరావు, బి.జగదీశ్, డి.ఈశ్వర్, డి.శ్రీనివాస్, బత్తిన రామకృష్ణ, పీఏ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయం

మాజీ ఎంపీ చింతా మోహన్

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీ నగర్): దేశం లో, రాష్ట్రంలో పేదవారి పరిస్థితి అత్యంత దారు ణంగా ఘోరంగా ఉందని, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ చింతా మోహన్ అవేదన వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 1991లో పీవీ నరసింహారావు ప్రధా నిగా ఉన్న సమయంలో ఆర్థిక సంస్కరణల పేరుతో కిటీకిలు తెరిస్తే... ప్రస్తుత మోదీ ప్రభుత్వం తలుపులు బార్ల తెరచి పేద వారిని మరింత పేదవారిగా మార్చడమే కాకుండా దేశ సంపదను గుత్తమొత్తంగా అదాని వంటి వారికి దోచుపెడుతున్నారన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలు దేశానికి కొంత వరకు మాత్రమే అవసరం అన్నారు. కేంద్ర బడ్జెట్ అంటేనే పెద్ద అంకెల గారడీ దేశ సంపదను సంపన్నుల చేతిలో పెట్టేస్తున్నారు. ఇది అడిగిన రాహుల్ గాంధీని ఇబ్బందులు పెట్టారన్నారు. ఇందిరాగాంధీ మనవడు, రాజీవ్‌గాంధీ కుమారుడి పై కక్ష సాధింపా అని ప్రశ్నించారు. ఆస్తులు త్యాగం చేసిన కుటుంబాలను మోదీ, అమిత్ షాలు అవమానించారన్నారు. నీరవ్ మోదీ, లలిత్ మోదీ మోసం చేయలేదా? రాహుల్ గాంధీ వాస్తవాలు మాట్లాడుతుంటే తట్టుకొలేక మాజీ ఎంపీని చేశారని, అఖరుకు ఇల్లు కూడా ఖాళీ చేయించారన్నారు. తాను మాజీ ఎంపీ అయినా కూడా రెండేళ్ల నన్ను ఎవరూ ఖాళీ చేయమని చెప్పలేదన్నారు. రాహుల్ గాంధీ ఆ ఇంట్లో ఉంటే తప్పేంటి, కోర్టులు కూడా దిల్లీలో చెప్పింది చదువుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. కర్నాటకలో 120 సీట్లతో కాంగ్రెస్ గెలవబోతోందని చెప్పారు. రాష్ట్రంలో అయితే పేదల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందన్నారు. విద్యార్థులకు స్కాలర్షిప్ లు రావడం లేదు... ఇళ్ల నిర్మాణాలు ఆపేశారు... కార్పొరేషన్‌లకు నిధులు ఆపేశారన్నారు. రాష్ట్రంలో పరిస్థితి చూస్తే బాధగా ఉందని, ఆయనకు సీబీఐ నోటీసు, ఈయనకు జైల్... మరో 100 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం పడిపోవడం ఖాయమన్నారు. అది ఆర్థిక పరిస్థితుల వల్ల కావచ్చు... మరే ఇతర కారణాలు అయినా కావచ్చు అన్నారు. వైఎస్ నా మిత్రుడని, ఆయన కొడుకు సీఎం అయ్యాడని అనుకున్నా కానీ ఒక్క ఛాన్స్ అని రాష్ట్రాన్ని అన్నివిధాలా నాశనం చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి రోజుకు కనీసం ఐదారు గంటలు కూడా నిద్ర పోవడం లేదన్నారు. కాంగ్రెస్ అండతో ఎంతో మంది సీఎం పదవి, ఇతర హోదాలు అనుభవించారని ప్రస్తు తం వారి కుమారులు ఇతర పార్టీల్లోకి వెళ్లారు... అటువంటింటి వారందర్నీ తిరిగి కాంగ్రెస్ లోకి రమ్మని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఒక మాజీ ముఖ్యమంత్రి బీజేపీలోకి ఎందుకు వెళ్లారో తెలియ దన్నారు. రామోజీరావు కష్టపడి ఉన్నతస్థానంలోకి వచ్చి అనేక మందికి అవకాశాలు కల్పించారని, ఎవరి దగ్గర తల వంచే వ్యక్తి కాదు అటువంటి ఆయనపై మా పార్టీలో ఉండవల్లి ఆరోపణలు చేశారని, వాటితో తాను ఏకీభవించటం లేదన్నారు. గతంలో పోలవరంలో ధన యజ్ఞం జరుగుతుందని రాసినందుకు ఆయనపై కక్ష కట్టి కేస్‌లతో ఇబ్బంది పెడుతున్నారన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

డేగా ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా ఈదురు గాలులు, ఉరుములతో కురిసిన వర్షానికి ధాన్యం రాశులు, పొలాల్లో ఉన్న వరి పనలు తడిసిన కారణంగా అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కొంత భాగం, ఏలూరు, కోనసీమ అంబేద్కర్ జిల్లాలలో ధాన్యం కల్లాలలోనే ఉందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి పూర్తిగా తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని జిల్లా యంత్రాంగం చెబుతున్నా...రైతు భరోసా కేంద్రాలలో వాటి కొరతను సాకుగా చూపి ధాన్యం కొనుగోలు చేయకపోవడం దుర్మార్గమని ప్రభాకర్ విమర్శించారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేసే పరిస్థితి ఉండదని ఆందోళన వెలిబుచ్చారు. మెట్ట ప్రాంతాలలో అరటి, జీడి మామిడి పంటలు వడగళ్ల వానకు మచ్చ వచ్చి పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నాణ్యతతో కూడిన ఎండుమిర్చి లభిస్తోందని, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా ఎటపాక మండలం నుండి ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం వరకు కల్లాలలో ఉన్న మిర్చి వర్షాల కారణంగా దెబ్బతిందని తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వ్యవసాయ మార్కెట్ల ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లాలో పిడుగుపాటు కారణంగా ఐదుగురు రైతులు మృతి చెందారని, వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్

కలప రవాణాకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ...

విశాలాంధ్ర-దేవీపట్నం: తూర్పు ఏజెన్సీ రంపచోడవరంలో అటవీ శాఖలో అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డి.లలిత కుమారి ఓ వ్యక్తి దగ్గర టేకు కలప రవాణాకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ దాడిలో పట్టుబడింది. లలితకుమారి అడ్డతీగల రేంజ్ ఆఫీస్‌లో అసిస్టెంట్ రేంజ్ ఆఫీ సర్‌గా పని చేస్తూ రంపచోడవరంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టేకు చెట్లు తీసుకువెళ్లేందుకు అనుమతి కోసం కొండబాబు అనే వ్యక్తి వద్ద 50 వేలు డిమాండ్ చేసి, ఆ మొత్తం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఈ దాడిలో ఏసీబీ అధికారి షకీల భాను, డీఎస్పీ రమణమూర్తి పాల్గొన్నారు.

మద్యంషాపు ఉద్యోగులకు పూచీకత్తు

27న నిరసనలను జయప్రదం చేయండి

ఏపీ బేవరేజెస్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తాటిపాక మధు

విశాలాంధ్ర బ్యూరో-రాజమండ్రి: మద్యం షాపుల్లో పని చేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ లందరూ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులతో రూ.3 లక్షల పూచీకత్తు సమర్పించాలన్న ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులను నిరసిస్తూ ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల ముందు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లు నిరసనలు తెలపాలని ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం రాష్ట్రవ్యాప్తంగా సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లతో జూమ్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ ఎండీ అన్యాయంగా ఉద్యోగుల భవితవ్యానికి ఉరితాడు బిగించారని విమర్శించారు. రాష్ట్రంలో 14,000 మంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ఉన్నారని తెలిపారు. మీరందరూ ఉద్యోగాల్లో కొనసాగాలంటే ప్రతి ఉద్యోగి రూ.3 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగుల ఆమోదంతో పూచీకత్తు సమర్పించాలనడం చాలా అన్యాయం అన్నారు ఉద్యోగాల్లో ఎక్కడా లేని వింత పోకడలు ఇక్కడే ఉన్నాయని ధ్వజమెత్తారు. ఈ రోజుల్లో ఉద్యోగస్తులు సొంత వారికే పూర్తిగా పూచీకత్తు పెట్టడం లేదని, అలాంటిది తెలియని ముఖాలకు ఎందుకు పెడతారని ఆయన అన్నారు. గుంటూరు, బాపట్ల, అనంతపురం, కర్నూలు తదితర జిల్లాల్లో రెండు నెలలుగా ఇదే సాకు చూపించి జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. ఈ నెలాఖరు నాటికి యాజమాన్యం పూచీకత్తు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే చలో విజయ వాడకు పిలుపునిస్తామని, అవసరమైతే సమ్మె చేస్తామని మధు హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పవన్ (విశాఖపట్నం), జనరల్ సెక్రెటరీ రామచంద్రరావు (విజయనగరం), జక్కి యాదవ్ (అనంతపురం), ఉపాధ్యక్షులు చిన్న మునలయ్య (కర్నూలు), కిషోర్ (గుంటూరు) కోటేశ్వరరావు (తెనాలి), సుబ్ర హ్మణ్యం (విజయవాడ), రెడ్డి శ్రీనివాస్ (తూర్పు గోదావరి), నాయుడు (కాకినాడ) తదితరులు మాట్లాడారు.

హిందూజా కంపెనీకి ప్రజాధనం చెల్లించొద్దు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇప్పటికే రూ.800కోట్ల రూపాయలు డిస్కమ్‌ల నుంచి పొందిన హిందూజా కంపెనీ మరో రూ.2వేల కోట్ల రూపాయలకు పైగా దొడ్డిదారిన సంపాదించాలని ప్రయత్నిస్తుండం గర్హనీయమని, ప్రజాధనం హిందూజా కంపెనీకి చెల్లించొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఇప్పటికే విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ కేవలం ఉత్పత్తి చేసిన విద్యుత్‌కే రూ.4.88 పైసలు చెల్లించాలని, ఇంకేమీ అవసరం లేదని తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం డిస్కమ్‌ల ద్వారా రూ.800 కోట్లు అప్పగించిందని గుర్తుచేశారు. హిందూజా కంపెనీ తనకు మరో రూ.1600 కోట్లు చెల్లించాలని తాజాగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని కోరినట్లు వార్తలొచ్చాయని, ఆ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిం చరాదన్నారు. హిందూజా కంపెనీకి ఏ పేరుతో కట్టబెట్టినా అంతిమంగా ఆ భారాన్ని ప్రజలే మోయాలని, ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెరిగి, ట్రూఅప్ చార్జీల పేరిట భారం వేసిన ప్రభుత్వం ఈ హిందూజా పేరుతో మళ్లీ వడ్డించడాన్ని తిరస్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

దళితద్రోహి జగన్: వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ దళిత ద్రోహి అని, దళితబాంధవుడు-పేదలపెన్నిధి చంద్రన్న పుస్తకాన్ని ప్రతిదళితుడు చదివి, జగన్‌ని, ఆయన ప్రభుత్వాన్ని నిలదీయాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఈ పుస్తకాన్ని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యతో ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, అనుబంధ సంఘాల నేతలు ఆవిష్కరించారు. వర్ల రామయ్య మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ప్రతి దళితగృహానికి పంపిస్తామని, జగన్ బాగోతాన్ని, దుర్మార్గాలను దళితవాడల్లో ఎండగట్టి, అబద్ధాలు, అసత్యాలతో దళితుల ఓట్లు దండుకున్న జగన్ పతనానికి నాందిపలుకుతామన్నారు. దళితనేతలతో, దళితమంత్రులతో సమావేశాలు పెట్టే హక్కు ఈ ప్రభుత్వానికి, సజ్జలకు ఎక్కడుంది? డాక్టర్ సుధాకర్ ఎందుకు చనిపోయాడో, పోలీస్ స్టేషన్లో వరప్రసాద్‌కు శిరోముండనం ఎందుకు జరిగిందో, ఓంప్రతాప్ అనే దళితయువకుడు ఎందుకు చనిపోయాడో, ఎవరు చంపారో, దళితఆడబిడ్డల మానప్రాణాలను ఎందుకు బలితీసుకున్నారో, ఎవరు బలితీసుకున్నారో సమాధానం చెప్పాకే సజ్జల దళిత సమా వేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దళితుల కోసం చంద్రబాబు అమలుచేసిన 28 ప్రత్యేక పథకాల్ని జగన్ రద్దుచేసినప్పుడు దళిత మంత్రులు నోరెత్తరేం అని ప్రశ్నించారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ టీడీపీ విడుదలచేసిన పుస్తకంలోని ప్రతి అంశాన్ని ఆధారాలతో సహా నిరూపించడానికి తాము సిద్ధమని, దళితమంత్రులు ఎవరైనా, ఎప్పుడైనా చిత్తశుద్ధితో నిజాయితీతో చర్చకు రావచ్చు అని సవాల్ విసిరారు.

భర్త ఘాతుకం

భార్యపై యాసిడ్ దాడి

విశాలాంధ్ర-తొట్టంబేడు: అనుమానం పెరిగి పెద్దదైంది. పెద్దల సాక్షిగా పెళ్లాడిన భార్యపై కనీస కనికరం చూపలేదు. భార్య పట్ల కాలయముడుగా మారాడు. అతికిరాతకంగా మర్మాంగంపై యాసిడ్ పోశాడు. అంతటితో ఆగకుండా శరీరంపైనా పోశాడు. బాధితురాలి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మేర్ల పాకకు చెందిన వెంకటకృష్ణయ్య కుమార్తె ఆదిలక్ష్మి(32)ని ఎనిమిదేళ్ల కిందట తొట్టంబేడు మండలం బోనుపల్లెకు చెందిన చుక్కల సుధాకర్‌కు ఇచ్చి వివాహం చేశారు. సుధాకర్ కొయ్య బొమ్మల పని చేస్తుంటాడు. వారికి శరణ్య, ఇషిత అనే ఇద్దరు కుమార్తెలు. వీరి సంసారం కొంతకాలం సవ్యంగానే సాగింది. తరువాత ఆదిలక్ష్మిపై భర్త సుధాకర్‌కు అనుమానం మొదలైంది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య మనస్పర్ధలు పెరిగాయి. ఇదిలా ఉండగా ఆదిలక్ష్మి బతుకుదెరువు కోసం రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగం చేస్తోంది. అవసరాల కోసం ఇతరులతో ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేది. ఇది భార్యాభర్తల మధ్య మరింత దూరం పెంచింది. ఉద్యోగం మానేయాలని ఆదిలక్ష్మిని సుధాకర్ కోరాడు. ఉద్యోగం మానేస్తే బతుకుదెరువు పోతుందనే ఉద్దేశంతో ఆమె ఆగలేదు. ఇది సుధాకర్‌కు మరింత ఆగ్రహం తెప్పించింది. ఇక భార్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. విధులు ముగించుకుని వచ్చిన ఆదిలక్ష్మిని ఇంట్లోకి రావద్దని అడ్డుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆదిలక్ష్మిపై సుధాకర్ భౌతికదాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ముందస్తు పథకం ప్రకారం ఆమెను కింద పడేసి మర్మాంగంలోనూ, శరీరంపైనా యాసిడ్ పోశాడు. ఆదిలక్ష్మి శరీరం 50 శాతం పైగా కాలిపోయింది. ఆమె కేకలు విని చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనపై ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులు తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో సంచలనం సృష్టించింది.

రాయలసీమను విడదీసే దమ్మూ ధైర్యం ఎవరికీ లేదు

- బుందేల్‌ఖండ్ ప్యాకేజీ అంటే ఎంపీ, ఎమ్మెల్యేలకు తెలియదు
- ఎగువ భద్ర కడితే రాయలసీమ ఎడారే
- అమరావతి ఫ్రీ జోన్ చేసి ఉద్యోగాలివ్వాలి
- రాయలసీమ కర్తవ్య దీక్షలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : రాయలసీమ గడ్డను విడదీసే దమ్మూధైర్యం ఎవరికీ లేదని... రాయలసీమ పౌరుషాల గడ్డ అని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం కర్నూలు పట్టణంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నీళ్లు, నిధులు, నియామకాల సమాన వాటా కోసం రాయలసీమ కర్తవ్య దీక్షను బైరెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ గడ్డ స్వార్థపరులు, రాజకీయ నాయకులది కాదని త్యాగయ్య, అన్నమయ్య ఎందరో మహానుభావుల గడ్డని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కంటే కోటి రెట్లు దారిద్ర్యం రాయలసీమలో ఉందన్నారు. సిద్దేశ్వరం ప్రాంతంలో కృష్ణా, పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆంగ్లేయులు ఆనాడే ప్రణాళికలు సిద్ధం చేశారని, కానీ పాలకులు వారి స్వార్థం కోసం ఈ ప్రాజెక్టును నాగార్జున సాగర్‌గా నామకరణం చేసి, నిర్మించి సీమవాసులకు మొండి చెయ్యి చూపారని ఆరోపించారు. కర్నూలు రాజధాని మూడేళ్లు పెట్టి హైదరాబాద్‌కు తరలించుకు పోయారన్నారు. బళ్లారిని కర్నాటకకు కట్టి హోస్పేట డ్యామ్‌ను తరలించుకుపోయి సీమకు అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. బుందేల్‌ఖండ్ ప్యాకేజీ అంటే ఎమ్మెల్యే, ఎంపీలకు ఎవరికీ తెలియదని, ఆ ప్యాకేజీ ఏమీ రాలేదని, మాకు ఇచ్చింది ఏమీ లేదంటూ ఎద్దేవా చేశారు. ఎగువ భద్ర ప్రాజెక్టును కడితే రాయలసీమ ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసి జనాభా ప్రాతిపదికన రాయలసీమ వాసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ రత్నాలసీమ కాదని, నయవంచన చేశారన్నారు. రాజకీయ నాయకులు ఒకటే అడుగుతున్నా... 1951 నుంచి ఈరోజు వరకు మిలియన్ టన్నుల ఖనిజ సంపద లూటీ అయిందని, వాటి లెక్కలు చెప్పాలని, తిరుపతి, శ్రీశైలం దేవాలయ ఆదాయాలు తిమింగలాలు తిన్నాయని, వాటిని కక్కించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మే నెలలో సంతకాల సేకరణ తర్వాత దిల్లీలో జంతర్ మంతర్ వద్ద సంతకాలతో కూడిన పేపర్లను దిల్లీ పెద్దల ముఖాలపై కొడతామన్నారు. సిద్దేశ్వరం వద్ద నిర్మిస్తున్న తీగల వంతెన సినిమాల షూటింగ్, సెల్ఫీల కోసం తప్ప చీకటి బతుకుల్లో వెలుగు నింపదని, బ్రిడ్జి కం బ్యారేజ్ కావాలని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమలో ప్రస్తుతం నవ మోసాలు జరుగుతున్నాయన్నారు. రాజధానిని విశాఖ తరలించినా, మోటార్లకు మీటర్లు తగిలించినా తీవ్రంగా నష్టపోయేది రాయలసీమ వాసులే అన్నారు, తుంగభద్రపై నిర్మిస్తున్న ఎగువ భద్ర ప్రాజెక్టును ఆపు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని, సిద్దేశ్వరంపై బ్యారేజ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గఫూర్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రాయలసీమ సమస్యలపై పోరాటం చేయవలసిన ఆవశ్యకత ఉందని, దీనికి తనవంతుగా పోరాటాలకు సిద్ధమని తెలిపారు. మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రాయలమను అభివృద్ధి చేయ డంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ప్రత్యేక రాయలసీమ కోసం ఉద్యమం చేయవలసిన తరుణం ఏర్పడిందని, అందుకు పూర్వపు నాలుగు రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కలుపుకొని ఉద్యమం చేసి సాధించుకోవడం ద్వారా రాయలసీమకు మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ తెలంగాణా వల్లనే రాయలసీమకు మేలు జరుగుతుందని అన్నారు. తెలంగాణా రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలను కలిపి గ్రేటర్ తెలంగాణా రాష్ట్రంగా ఏర్పడితే బాగుండేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, ప్రజాగాయకుడు గద్దర్, విద్యాసంస్థల అధినేతలు పుల్లయ్య, నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ప్రసంగించారు.

Roc.No. 201/E1. Dt: 24.04.2023.

OFFICE OF THE PUNGANURU MUNICIPALITY
CHITTOOR DISTRICT

NOTICE INVITING EXPRESSION OF INTEREST

Sealed expression of interest is invited from the experienced and interested Consultants from the experienced and interested Consultants from detailed survey & preparation of Detailed project report (DPR I.e., Estimate and deigns) for the following item of work.

1. Providig water supply infrastructure to weaker sections in Pungunur.
2. Improvement of Water Supply by laying of 600Mm dia K9 line from SS Tanks to Wtp Under Amrut 2.0

Last date for submission of application 02.05.2023 i.e. Tuesday by 5.00PM. The commissioner, Punganur Municipality reserves all rights to cancel, reject or postpone or fix up any special conditions for all the applications without asigning any reasons or these of.

Conditions:
1. Conditions for EOI should be accepted.
2. Experience consultants in similar nature of works shall only be considered
3. Consultant should be empanelled in any dept in any stage.
4. The DPR should prepare in stipulated period and should get approved by any department.
5. The DPR's shall be prepared as per the guidelines and norms and all the information as per the check list raised by the department.
6. Commissioner, Punganur Municipality and Municipal Council has all powers to accept or reject the sealed tenders.
7. The rate quoted by the consultants shall be in percentage (%) of total estimated cost.

Any other details contact on Engineering section, Punganuru Municipality in working hours.

Contact Mobile No: Commissioner (9849905868)
Municipal Engineer (9398012414)

Commissioner,
Punganuru Municipality.

సంపాదకీయం

ముస్లింల రిజర్వేషన్లకు ఎసరు

కర్నాటకలో ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లకు మంగళం పాడేసిన బీజేపీ తెలంగాణాలో కూడా అదే పని చేయాలనుకుంటోంది. ఆదివారం హైదరాబాద్ సమీపంలోని చేవెళ్లలో బీజేపీ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో కనక వచ్చే శాసనసభ ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిలంకు రిజర్వేషన్లు రద్దు చేస్తామని తెగేసి చెప్పారు. మే 10న శాసనసభ ఎన్నికలు జరగవలసి ఉన్న కర్నాటకలో ఈ పని ఇటీవలె చేసేశారు. అంటే విద్య, ఉద్యోగాలలో ముస్లింలకు రిజర్వేషన్లు ఉండవన్న మాట. ముస్లింలలో ఉన్న పేదరికం దళితులలో ఉన్న పేదరికం కన్నా ఎక్కువ అని సచార్ కమిటీ తేల్చింది. ఆ తరవాతే ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం మొదలైంది. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం "రాజ్యాంగ విరుద్ధం" అని కూడా అమిత్ షా అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న ముస్లింలకు ప్రస్తుతం నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. ముస్లింలకు రెండు పడకగదుల ఇళ్లు కేటాయించడాన్ని కూడా అమిత్ షా అభ్యంతర పెట్టారు. ఇలాంటి ఇళ్లు పొందే హక్కు ఎస్.సి.లు, ఎస్.టి.లు, ఇతర వెనుకబడిన తరగతుల వారికి మాత్రమే ఉందని అమిత్ షా అభిప్రాయ పడ్డారు. తెలంగాణ శాసనసభకు ఈ ఏడాది చివరి నాటికి ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ సారి ఎలాగైనా తెలంగాణలో అధికారం చేపట్టగలమన్న భరోసా బీజేపీ లో వ్యక్తం అవుతోంది. దీనికి ప్రాతిపదిక ఉందా లేదా అని తేల్చడం ఎలాగైనా అధికారంలోకి రావాలనుకునే బీజేపీకి ఎటూ ఉండదు. కె.చంద్రశేఖర రావు ప్రభుత్వం ముస్లింలకు ప్రస్తుతం ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లను 12 శాతానికి పెంచాలని ఆలోచిస్తోంది. దీనికి సంబంధించి బిల్లు 2017లోనే ఆమోదించారు. ఈ బిల్లును ఆమోదించాలన్న తీర్మానంతో సహా తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపింది. కానీ కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తూనే ఉంది. మతం ఆధారంగా రిజర్వేషన్లను ఆమోదించలేమని కేంద్ర ప్రభుత్వం అంటోంది. ముస్లింలలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకే రిజర్వేషన్లు కల్పిస్తాం కనక ఈ బిల్లును ఆమోదించాలని తెలంగాణ ప్రభుత్వం కోరినా కేంద్రం లెక్క చేయలేదు. మొదట రిజర్వేషన్లు కల్పించినప్పుడు మత ప్రస్తావన లేని మాట నిజమే. కేవలం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలనుకున్నారు. ఆర్థిక వెనుకబాటుతనం ప్రస్తావన అప్పుడు లేదు. ఈ ప్రాతిపదికన ఎస్.సి., ఎస్.టి.లకు మాత్రమే మొదట్లో రిజర్వేషన్లు కల్పించారు. ఎస్.టి.లు అంటే గిరిజనులు అందరూ హిందువులా కాదా అన్న అంశం చర్చనీయమే కాని వారిని హిందువులుగా పరిగణించడం కొనసాగుతూనే ఉంది. బీజేపీ వారిని హిందువులుగా పరిగణించడానికి నానా పాట్లూ పడుతోంది. అంటే రాజ్యాంగ నిర్మాతలు సంకల్పించిన సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారు అంటే హిందువులు మాత్రమే పరిగణనలోకి వచ్చారు. ఇతర మతాల వారిలో కుల వ్యవస్థ, అంటరానితనం లేవు అన్న భ్రమతో వారికి రిజర్వేషన్ల అవసరం ఉందని భావించలేదు. ఈ రిజర్వేషన్లు ఖరారు చేసిన తరవాత రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా ఉన్న అంబేద్కర్ సామాజికంగా వెనుకబడిన తరగతుల వారు కూడా ఉన్నారనీ, వారికీ ఏదో వెసులుబాటు కల్పించాలని చెప్పారు. ఆ కారణంగానే ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించడానికి అనేక దశల్లో ప్రయత్నాలు జరిగాయి. చివరకు మండల్ కమిషన్ నివేదిక అమలులోకి వచ్చిన తరవాత ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు వర్తించాయి. మొదట రిజర్వేషన్లు కల్పించినప్పుడు వెనుకబడిన తరగతుల వారు అన్న నిర్వచనం కిందకు ఎస్.సి.లు, ఎస్.టి.లు మాత్రమే వచ్చారు. ఇతర వెనుకబడిన తరగతుల వారు అన్న మాట మండల్ కమిషన్ నేపథ్యంలోనే ప్రచారంలోకి వచ్చింది. ఇందులో కూడా హిందువులు కాని వారికి రిజర్వేషన్లు దక్కలేదు. పైగా ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించడంలో "వెనుకబడిన తరగతులలో సంపన్నవర్గం" అన్న భావన తీసుకొచ్చి, దానికి ఆర్థిక ప్రాతిపదికను ప్రమాణంగా తీసుకోవడానికి కారణం న్యాయవ్యవస్థే. అప్పుడూ ఇతర మతాల వారికి, ముఖ్యంగా వెనుకబడి ఉన్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉందనుకుంటున్న ముస్లింలకు రిజర్వేషన్లు దక్కలేదు. సచార్ కమిటీ నివేదిక ఆ అవకాశం కల్పించింది.

ముస్లింలకు ఉన్న రిజర్వేషన్లు తొలగిస్తాం అని అమిత్ షా చెప్పిన మాటను అర్థం చేసుకోవడానికి రిజర్వేషన్ల నేపథ్యం మొత్తాన్ని అర్థం చేసుకోవాలి. అయితే ఎప్పుడు ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం సాధించాలన్న లక్ష్యం మోదీకి, అమిత్ షాకు ఉన్నప్పటికీ ఈ విషయంలో వీరిద్దరి మధ్య పొంతన కుదరడం లేదని అనిపిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్ది నెలల కింద ముస్లింలలో వెనుకబడిన తరగతుల వారి ఓట్లు సంపాదించడానికి పాస్మాంద ముస్లింలను ఆదుకుంటామని చెప్పారు. ముమ్మారు తలాఖ్ కు వ్యతిరేకంగా పార్లమెంటులో చట్టం చేయడం ముస్లిం మహిళలకోసమే అని బీజేపీ దండోరా వేసుకుంటూనే ఉంటుంది. మోదీ చెప్పే మాటలకు అమిత్ షా చేసే ప్రకటనలకు మధ్య అంతరం కనిపించడం వారు భిన్న సైద్ధాంతికదారుల్లో ఉన్నారని కాదు.

ఉత్తర భారతదేశంలో హిందుత్వం శక్తుల ఏకీకరణ పూర్తి అయింది. దక్షిణాదిలో ఆ పని సంపూర్ణంగా జరగలేదు. ముస్లింల ఓట్లు లేకపోయినా ఫరవా లేదు అన్న ధరణిలో బీజేపీ కనిపిస్తోంది. కానీ 2024 సార్వత్రిక ఎన్నికలలో 400పైన సీట్లు సంపాదించాలని మోదీ ఆశిస్తున్నారు. అన్ని సీట్లు రావాలంటే కనీసం వెనుకబడిన ముస్లింవర్గాల ఓట్లైనా రాబట్టగలగాలి. అందుకే మోదీ పాస్మాందా ముస్లింల ప్రస్తావన తీసుకొస్తున్నారు. కానీ తెలంగాణలో అమిత్ షా దానికి భిన్నంగా మాట్లాడినట్టు కనిపిస్తోంది. కానీ కాదు. మోదీ వచ్చే ఎన్నికల్లో మెజారిటీని మరింత పెంచుకుని రికార్డు సృష్టించడం కోసం పాస్మాందా ముస్లింల ప్రస్తావన చేస్తే అమిత్ షా తెలంగాణలో హిందువుల ఓట్లను సంఘటితం చేయడం కోసం ముస్లింల రిజర్వేషన్లకు కత్తెర వేస్తామంటున్నారు. లక్ష్యం ఒకటే వ్యక్తీకరణలోనే తేడా. గత నెలలో అమిత్ షా కర్నాటకలో ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడుతూ ముస్లింల రిజర్వేషన్లు తొలగించడం గురించే మాట్లాడారు. ముస్లింలకు దక్కకుండా లాగేసిన నాలుగు శాతం రిజర్వేషన్లను ఒక్కలిగ-లింగాయత్ సామాజిక వర్గాలకు కేటాయించారు. తెలంగాణలోనూ అదే పని చేస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ ఆడించినట్లల్లా ఆడుతున్నారని అమిత్ షా అంటున్నారు. అందుకే హైదరాబాద్ విమోచన దినాన్ని ప్రభుత్వపరంగా నిర్వహించడం లేదట. ఇందులోనూ బీజేపీకి స్వార్థమే ఉంది. హైదరాబాద్ విమోచనను బీజేపీ ముస్లిం వ్యతిరేక దృష్టితోనే చూస్తుంది. ఎక్కడ ఏ పావు కదిపితే ఓట్లు రాలుతాయన్నదే బీజేపీ ఆలోచన తప్ప సమాజాభివృద్ధి బీజేపీ ఎజెండాలోనే ఉండదు.

అరగని నోటు-కడుపుకి చేటు

చింతపట్ల సుదర్శన్

ఖర్మమిట్లా కాలింది అనుకుంది గాడిద కడుపులో నొప్పి భరించలేక. ఇదివరకు ఇలాగ నొప్పివస్తే ఏ ఆకు నమిలో నాలుగు రకాల గడ్డిపోచలు కొరికో తగ్గించుకునేది. ఇప్పుడెందుకో తగ్గడం లేదు. స్వంత వైద్యం పనికి రాదని ఆసుపత్రికి బైలుదేరింది. ఆసుపత్రిలో జాతరకు వచ్చినట్ల జనం ఉన్నారు. వాళ్లు తినేవన్నీ కల్తీ వస్తువులేకదా. గాలీ, నీరూ కలుషితమే కదా. అందుకే కొత్త రోగాలు వస్తాయి. పాత రోగాలు తిరగబెడతాయి అనుకుంటూ వరండా మెట్ల దగ్గర ఆగిపోయింది. ఆసుపత్రిలోకి మనుషులకు ఉన్నట్లు, గాడిదలకుకూడా ప్రవేశంఉంటుందా అని అనుమానం వచ్చింది. ఏ డాక్టరైనా బైటకు వస్తే బాగుండు ననుకుంది. దేవుడనేవాడు ఉన్నాడో లేదో కానీ ఉంటే మనుషుల్నేకాదు గాడిదల్నికూడా పట్టించుకోవాలికదా అనుకుంది. తెల్లకోటూ మెడపైనుంచి వేళ్లాడుతున్న స్టెతస్కోప్‌తో బైటకు వచ్చాడు ఓ డాక్టర్. డాక్టర్‌కు ఎదురుగ్గా వెళ్లి నిలబడింది.

గాడిదను చూసి షాకయ్యాడు డాక్టర్. గుడ్‌మార్నింగ్ డాక్టర్ ఆశ్చర్యంతో మూర్ఛపోవడమో, కోమాలోకి వెళ్లడమో చెయ్యవద్దు. నేను మాటలు వచ్చిన గాడిదను అంది. అయితే అన్నాడు డాక్టర్ నీళ్లు నోట్లో నములుతూ. మరేం

రంగస్థలం

లేదంటే లేదనికాదు నిన్నట్నించీ కడుపునొప్పి తగ్గడంలేదు. వైద్యోనారాయణో హరీ అన్నారు కదా ఏదైనా ఓ మాత్ర ఇచ్చి నేను హరీ అనకుండా చూడండి డాక్టర్ అంది గాడిద దీనంగా.

కడుపులో నొప్పి ఆషామాషీ వ్యవహారం కాదు. ఆరోగ్యశ్రీ మనుషులకే సరిగ్గా వర్తించడం లేదు. ఇక గాడిదలకు వర్తిస్తుందా? రిసెప్షన్‌కి వెళ్లి ఫార్మాలిటీస్ పూర్తిచెయ్యి అన్నాడు డాక్టర్. ఫార్మాలిటీసా అవన్నీ మనుషులకే కదా. గాడిదను నా దగ్గరేముంది బూడిదరంగు జానా బెత్తెడు తోక తప్ప. అది అయ్యేపనికాదు. గానీ ఏదైనా ఉపాయం చెప్పండి. ఎక్సెల్ బాండ్‌పేపర్ గానీ హిందీన్యూస్ పేపరుగానీనమిల్తే సరిపోతుందా అంది గాడిద. ఫార్మాలిటీస్ పూర్తిచేస్తే మనుషులకూ, గాడిదలకూ, శవాలకూ కూడా స్పెషల్ రూం అలాట్‌చేస్తాం. బ్లడ్‌టెస్ట్, సిటిస్కాన్, డాప్లర్ టెస్టు, ఎక్స్‌రే ఎంఆర్ఐ, ఇసిజి, టూడి ఎకో ఇంకా చాలా టెస్టులుంటాయి. అవన్నీ చేయిస్తే కానీ నీ కడుపు నొప్పికి కారణంతెలీదు. ఆసుపత్రిలోఅడుగుబెట్టిన 'ఐక్రా'లతోనూ గాడిదల్లోనూ కూడా ఆ టెస్టులన్నీ చేయిస్తేకానీ డాక్టర్లకు నెలజీతాలు రావు అన్నాడు డాక్టర్.

అయ్యో అలాగా మరిప్పుడెలాగ అని దిగాలు పడింది గాడిద. దిగులు పడక మా నాన్న ఎప్పుడూ నన్ను గాడిద అనే సంబోధించేవాడు ఆ అనుబంధంతో చెప్తున్నా. కనిపిస్తున్న ఆ రోడ్డంట నేరుగా వెళ్లు. ఊరి చివర పశువుల ఆసుపత్రి ఉంది. అంటూ డాక్టర్ గాడిద వెనుకవైపు వెళ్లడానికి భయపడి వెనక్కి తిరిగి వరండా మెట్లెక్కాడు. పదరా గాడిదా అనుకుంటూ గాడిద పశువుల ఆసుపత్రివైపు నడిచింది. పశువులడాక్టర్ గాడిదను ఎగాదిగాచూసి నీ యజమాని ఎక్కడ అని అరిచాడు. గాడిద నాకు నేనే యజమానిని అంది. ఓహో మాటలు నేర్చిన గాడిదవా అన్నాడు డాక్టర్. తన కడుపునొప్పి సంగతి చెప్పింది గాడిద. అయితే ముందు నీ కడుపు ఎక్స్‌రే తీయాలి అన్నాడు డాక్టర్. ఎక్స్‌రేలో తెల్సింది గాడిద కడుపునొప్పికి అసలు కారణం. గాడిద క్రితం రోజు పేపరు కాయితాలతో పాటు పింకు రంగులో ఉన్న రెండు వేల నోటుని నమలకుండానే మింగేసింది. గాడిద కడుపునొప్పికి ఆ నోటే కారణం అంటూ డాక్టర్ గాడిద పొట్టలో హోలీ పిచికారీ అంత సైజులో ఉన్న ఇంజక్షన్ పొడిచి ఈ సారి పొరపాటున కూడా కరెన్సీనోట్లు మింగకు అవి మనుషులకేకాని గాడిదలకు అరగవు అన్నాడు. కడుపు కుదుట పడి సాయంత్రానికి పాడుబడ్డ ఇంటిఅరుగుమీదకు చేరుకుంది గాడిద. అప్పటికే అరుగుమీద బజ్జీలు తినేసి పొట్లాం కాగితం గాడిదకు ఇవ్వడానికి చూస్తున్న అబ్బాయి 'బ్రో' ఇంకా రాలేదేమని ఎదురుచూస్తున్న కుక్కా ఉన్నవి.

ఏమిటింత లేటు అన్నాడు అబ్బాయి కాగితం గాడిద నోటికి అందించ బోతూ. వద్దన్నా ఇవాళంతా కడుపునొప్పితో హైరానా పడ్డా. ఇంజక్షన్ పొడిపించుకొచ్చా. రేపటిదాకా 'ఇంటర్మిటెంట్ ఫాస్టింగే'. పేపరాపక్కన రాయి కింద పెట్టు. బ్రేక్‌ఫాస్ట్‌కు పనికి వస్తుంది అన్నది గాడిద. ఇంతకీ సింటెక్స్ ట్యాంకంత నీ కడుపుకి నొప్పి ఎందుకు వచ్చిందో అన్నాడు అబ్బాయి. పొరపాటున రెండువేల నోటు మింగడమే నన్నాడు డాక్టర్ అంది గాడిద. బ్లాక్‌మనీ అయి ఉంటుంది అదెక్కడ దొరికిందో చెప్పు వెళ్లి వెతికితే ఇంకా దొరకొచ్చు అన్నాడు మనిషి. పొద్దున ఒకాయన ఇన్‌కంటాక్స్ వాళ్లు వచ్చి తన డబ్బు లారీలో తీసుకెళ్లారంటూ రోడ్డుమీద భోరున ఏడుస్తుంటే చూశా. లారీ లోంచి గాలికెగిరి ఓ నోటు పడిందేమో నువ్వు అనవసరంగా ఎక్సయిట్ అవకు అంది కుక్క. ఒక్క రెండువేల నోటే నా బానపొట్టను అతలాకుతలం చేసి పట్టపగలే చుక్కలు చూపించే మరి ఈ పెద్దమనుషులు పార్టీ ఫండ్లని, ప్రాజెక్టులని, పథకాలని, కాంట్రాక్టులని, రియల్ ఎస్టేట్లని, పైరవీలని ప్రజాసేవలని అనేక వేల నోట్లు మింగేస్తున్నారే! నొక్కేస్తున్నారే వాటికోసం అడ్డమైన గడ్డి మేసేస్తున్నారే, వీళ్ల వసలు కడుపులా చెరువులా అంది. గాడిద తన పొట్టవైపు చూసుకుంటూ. పశువులదాణాలు తిన్నవాళ్లకు, నోట్లుపోగేసు కుంటున్న వాళ్లకు, బ్యాంకులు దోచుకున్నవాళ్లకు, స్విస్‌బ్యాంకులో దాచుకున్న వాళ్లకు రాని కడుపునొప్పి నీకు రావడమేమిటి ఖర్మకాకపోతే అన్నాడు అబ్బాయి. ఏ పూటకాపూట కడుపునిండితే చాలు అనుకునేవాళ్లం మనం గాడిదలం, కుక్కలం, మనవళ్లకి, మునిమనవళ్లకి కూడా కూడ బెట్టాలని అడ్డమైన పనులు చేసేవాళ్లు మనుషులు. ఛీ! వీళ్లసలు మనుషులేనా అంటూ చెవులు వేలాడేసింది కుక్క

అబద్ధాల ప్రచారంలో కాషాయ దళాలు

ఎం కోటేశ్వరరావు

'షిరిడీ సాయి ట్రస్టు మసీదులకు రు.96 కోట్లు షిరిడీ హజ్‌కు రు.35 కోట్లు విరాళమిచ్చింది.' ఈ రెండింటికీ జత చేసిన అంశాలేమి టంటే షిరిడీ దేవాలయానికి విరాళాలు ఎక్కువగా ఇచ్చేది హిందూ భక్తులు. అలాంటి సంస్థ అయోధ్య రామమందిరానికి విరాళం ఇచ్చేందుకు తిరస్కరించింది. తాము హిందువులకు భిన్నమని చెప్పినట్లు కూడా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్‌లో ప్రచారం జోరుగా సాగుతున్నది. ఇది నిజమేనా? కాగల పని గంధర్వులు తీర్చారు అన్నట్లుగా కాషాయ మరుగుజ్జులు చేస్తున్న దాన్ని చూసీ చూడనట్లు ఉందన్నది స్పష్టం. ఈ ప్రచారానికి సంబంధించి కొన్ని మీడియా సంస్థలు నిజనిర్ధారణలు జరిపి షిరిడీ సాయి ట్రస్టు అలాంటి విరాళాలు ఇవ్వలేదని ప్రకటించినప్పటికీ ఇంకా ప్రచారం జరుగుతూనే ఉంది. పనిగట్టుకుచేసేదే. గోబెల్స్ ప్రచారం గనుక వారికి వాస్తవాలతో నిమిత్తం ఉండదు. సత్యమునే చెప్పవలెను-అబద్ధమాడరాదు, సత్యహరిశ్చంద్రుడు పుట్టిన గడ్డ ఇది అని చెప్పుకొనే చోట ఇలాంటి ప్రచారం జరుగుతున్నదంటే నిజానికి అది రాముడికి, హరిశ్చంద్రుడికి ఘోర అవమానం, వారి పేర్లను స్మరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నది స్పష్టం. ఇలాంటి ప్రచారాలుచేసే చీకటి శక్తులేవో అందరికీ తెలిసిందే.ఏకత, శీలము ఉన్నవారు చేసే పనేనా ఇది?

ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే అయోధ్య రామాలయ నిర్మాణానికి విరాళం ఇమ్మని షిరిడీ సాయి ట్రస్టును అసలు అడగలేదని ది క్వింట్ అనే వెబ్ పత్రిక 2021 జనవరి 18న స్పష్టం చేసింది. ఈ ప్రచారం పచ్చి అవాస్తవమని, విరాళం కోరుతూ తమకు ఎలాంటి సమాచారం లేదని ట్రస్టు సిఇఓ కెహెచ్ బగాటే, విరాళం కోసం తామెలాంటి వినతి పంపలేదని రామాలయ ట్రస్టు సభ్యుడు మోహన ప్రతాప్ మిశ్రా చెప్పినట్లు పేర్కొన్నది. హిందూస్తాన్ టైమ్స్‌లో వచ్చిన ఒక వార్త ప్రకారం రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు విరాళాలు తీసుకోవటం 2021 జనవరి 15 నుంచి ప్రారంభించిందని, దాని కంటే ముందే ఐదవ తేదీ నుంచే షిరిడీ ట్రస్టు నిరాకరణ గురించి ప్రచారం జరుగుతున్నట్లు క్వింట్ పేర్కొన్నది.

ఈ ప్రచారాన్నే "హార్డ్ కోర్ హిందూ సేన ఆఫ్ చీఫ్ మినిస్టర్ యోగి ఆదిత్య నాథ్ " పేరుతో నడుపుతున్న ఒక గ్రూపులో, హిందూ రాష్ట్ర భారత్ వంటి గ్రూపుల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసినట్లు ది లాలన్‌టాప్

> షిరిడీ సాయి మందిరం గురించి తప్పుడు ప్రచారం కొత్త కాదు. షిరిడీ సాయిబాబా హిందూముస్లిం ఐక్యతకు ప్రతీక కాదు, దేవుడూ కాదని మానవుడు కనుక పూజించ వద్దని ద్వారకా పీఠం శంకరాచార్య స్వామి స్వరూపానంద 2014 జూన్ 24న చెన్నైలో పిలుపునిచ్చారు. నిజంగా సాయిబాబా హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీకైతే ముస్లింలు కూడా విశ్వాసం వెల్లడించేవారని అన్నారు. సాయిబాబా గంగలో మునిగేందుకు తిరస్కరించారని, అతని పేరుతో గుళ్లు కట్టటం డబ్బు సంపాదనకేనని, సనాతన ధర్మంలో విష్ణువు 24 అవతారాల గురించి చెప్పారని దానిలో సాయిబాబా లేరని, హిందువుల మధ్య విభజన కుట్రలో భాగంగా బాబాకు పూజలు చేస్తున్నారని ఆరోపించారు. బ్రిటీష్ వారు బాబాను ముందుకు తెచ్చారని కూడా ఆరోపించారు.

అనే వెబ్‌సైట్ 2020 జూన్ 22న వెల్లడించింది. దీని గురించి శ్రీ సాయి బాబా సంస్థాన్ ట్రస్టు సిఇఓ అరుణ్ కిషోర్ డోంగ్రే మాట్లాడుతూ ఇక్కడికి అన్ని మతాలకు చెందిన వారు వస్తారని, ఒక చట్టం ప్రకారం పని చేస్తున్న ట్రస్టు రు.50 లక్షలకు మించి అదనంగా ఎవరికైనా విరాళం ఇవ్వాలంటే హైకోర్టు అనుమతి తీసుకోవాలని, రామ మందిరానికి విరాళం ప్రతిపాదన ఎలాంటిదీ తమ వద్దకు రాలేదని, జరుగుతున్నదంతా తప్పుడు ప్రచారమని చెప్పినట్లు కూడా ఆ సైట్ పేర్కొన్నది. ఈ ప్రచారం 2019 డిసెంబరులో కూడా జరిగిందని, అప్పుడు షిరిడీ ట్రస్టు సిఇఓగా ఉన్న దీపక్ ముఘాలికర్ కూడా అది తప్పుడు ప్రచారమని చెప్పారు. మసీదుల మరమ్మతు, నిర్మాణాలకు రు.96 కోట్లను షిరిడీ ట్రస్టు విరాళంగా ఇచ్చినట్లు, రామ మందిరానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని జరుపుతున్న ప్రచారం వాస్తవం కాదని చెక్‌పోస్ట్ అనే మరాఠీ వెబ్‌సైట్ 2021అక్టోబరు 30న పేర్కొన్నది. "బుద్ధిలేని మన హిందువులు సాయి గుడికి వెళుతున్నారు. తలలు వంచి కానుకలు సమర్పిస్తున్నారు. ఒక కుట్రప్రకారం సాయివిగ్రహాలను హిందువుల గుళ్లలో పెడుతున్నారు. హిందువులారా జాగ్రత్తగా ఉండండి, నిజాలను తెలుసుకొనేందుకు ప్రయత్నించండి" అంటూ కూడా వాట్సాప్‌లో ప్రచారం చేస్తున్నట్లు అది పేర్కొన్నది. షిరిడీ ట్రస్ట్ వెబ్‌సైట్‌లో ఉంచిన ఒక నివేదిక ప్రకారం 2019-20 ఆర్థిక సంవత్సరంలో ట్రస్టు ఇచ్చిన 58 విరాళాల జాబితా ప్రకారం వాటికి ఇచ్చిన మొత్తం రు. 101.48 కోట్లని, దానిలో కరోనా సమయంలో సిఎం సహాయ నిధికి 51 కోట్లు ఇచ్చినట్లు ఉంది తప్ప ఎలాంటి మసీదు పేరు లేదని చెక్‌పోస్ట్ పేర్కొన్నది.

రామమందిర ట్రస్టు నిబంధనావళిని 2020 ఫిబ్రవరి ఐదున ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించినట్లుగా మనీకంట్రోల్ వెబ్‌సైట్ అదే ఏడాది ఫిబ్రవరి 20న ఒక వార్తలో పేర్కొన్నది. విరాళాలను స్వీకరించే వ్యవస్థను ఇంకా ఏర్పాటు చేయాల్సి ఉందని, పెద్ద మొత్తంలో వచ్చిన విరాళాన్ని ట్రస్టు తిరస్కరించినట్లు ద ప్రింట్ అనే వెబ్‌సైట్ వార్తను అది ఉటం కించింది. దాని ప్రకారం బిహార్‌కు చెందిన రిటైర్డ్ ఐపిఎస్ అధికారి కిషోర్ కునాల్ తాను రామ మందిరానికి పది కోట్ల మేరకు విరాళం ఇవ్వదలచుకున్నట్లు ప్రకటించారని, దానిలో భాగంగా రు. రెండు కోట్ల చెక్ తీసుకొని అయోధ్య రాగా విరాళాలను స్వీకరించే వ్యవస్థ లేనందున దాన్ని తిరస్కరిస్తున్నట్లు చెప్పారని ప్రింట్ పేర్కొన్నది. రామమందిర ట్రస్ట్‌లోని ఏకైక దళిత సభ్యుడు, విశ్వహిందూ పరిషత్ నేత కమలేష్ చౌపాల్ మాట్లాడుతూ దేశమంతటి నుంచి అనేక మంది విరాళాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, మందిర నిర్మాణానికి నిధుల కొరత లేదని అన్నట్లు కూడా రాసింది.

షిరిడీ సాయి మందిరం గురించి తప్పుడు ప్రచారం కొత్త కాదు. షిరిడీ సాయిబాబా హిందూముస్లిం ఐక్యతకు ప్రతీక కాదు, దేవుడూ కాదని మానవుడు కనుక పూజించ వద్దని ద్వారకా పీఠం శంకరాచార్య స్వామి స్వరూపానంద 2014 జూన్ 24న చెన్నైలో పిలుపునిచ్చారు. నిజంగా సాయిబాబా హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీకైతే ముస్లింలు కూడా విశ్వాసం వెల్లడించేవారని అన్నారు. సాయిబాబా గంగలో మునిగేందుకు తిరస్కరించారని, అతని పేరుతో గుళ్లు కట్టటం డబ్బు సంపాదనకేనని, సనాతన ధర్మంలో విష్ణువు 24 అవతారాల గురించి చెప్పారని దానిలో సాయిబాబా లేరని, హిందువుల మధ్య విభజన కుట్రలో భాగంగా బాబాకు పూజలు చేస్తున్నారని ఆరోపించారు. బ్రిటీష్ వారు బాబాను ముందుకు తెచ్చారని కూడా ఆరోపించారు.

చేనేతపై ప్రభుత్వాల చిన్నచూపు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానపరమైన లోపాలతో చేనేతరంగానికి తీవ్రనష్టం వాటిల్లుతోంది. దేశ ఆర్థికవ్యవస్థలో, ఉపాధికల్పనలో చేనేత రంగం కీలకమైంది. దేశంలో వ్యవసాయం తర్వాత ఉపాధికి అవకాశాలున్న రెండవ అతి పెద్ద పరిశ్రమ వస్త్ర పరిశ్రమ. అందులో చేనేత రంగం వాటా ఎక్కువ. అంతేకాకుండా దేశ వారసత్వ సంపదైన చేనేతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా భారతీయ చేనేత వస్త్రాలకు మంచి డిమాండ్ ఉంది. అయినా ఈ రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఈ రంగంలో దేశ వ్యాప్తంగా దాదాపు 4 కోట్ల మంది ప్రత్యక్షంగా, 15 కోట్ల మంది పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగంపై దాదాపు 3 లక్షల మంది ప్రత్యక్షంగా, 8లక్షల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. పరోక్షంగా అంటే.. నూలు తయారు చేయడం, వడకడం, అచ్చు అతకడం, పడుగులు చేయడం, చిలపలను కండెలుగా తయారు చేయడం, మగ్గాలు, డిజైన్ డాబీలు, రాట్నాలు, నాడెలు, పన్నెలు, పన్నెల్లో ఇత్తడి ఈనెలు...వంటివి తయారు చేయడం, నూలుకు రంగులు అద్దడం, పట్టు, రేషన్ దారాలు తయారు చేయడం, ఆసు తోడటం వంటి పనుల ద్వారా ఉపాధి పొందడం. ఈ రంగంపై ఇంతమంది ఆధారపడి జీవిస్తున్నా, ప్రభుత్వాల ప్రోత్సాహం కరువైంది. దాంతో చేనేత రంగం అనేక ఒడిదుడుకులకు లోనవుతోంది. చేనేత కార్మికులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వీరు అసంఘటిత రంగంలో ఉండటం వల్ల పోరాట పటిమలేక నానా అవస్థలు పడుతున్నారు. ఏమీ సాధించుకోలేని స్థితిలో ఉన్నారు.

1985లో రూపొందించిన చేనేత రిజర్వేషన్ చట్టం సరిగా అమలు కావడం లేదు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణ కొరవడింది. ఈ చట్టం ప్రకారం చేనేతను ప్రోత్సహించేందుకు 11 రకాల వస్త్రోత్పత్తు లను చేనేతకు కేటాయించారు. రిజర్వు చేసిన వస్త్రాలలో ముఖ్యమైనవి భారతీయ మహిళలు ధరించే చీరలు. చేనేత రిజర్వేషను చట్టం అమలు బాధ్యత రాష్ట్రాలకు అప్పగించి అవసరమైన నిధులను కేంద్రం మంజూరు చేయాలి. చేనేతకు రిజర్వుచేసిన వస్త్రాలను పవర్‌లూమ్స్‌పై తయారు చేయకూడదు. అయితే, చాలా రాష్ట్రాల్లో మరమగ్గాలపై యాజమాన్యాల ఆధిపత్యంవల్ల ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలేదు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయవలసిన కేంద్రం దానిని పట్టించు కోవడం లేదు. పాఠశాలల పిల్లలకు చేనేతవస్త్రాలతో తయారుచేసిన యూనిఫాం ఇవ్వవలసిన పథకాన్ని అమలు చేయడంలేదు. ఆప్కో చైర్మన్లుగా చేనేతవర్గాలకు చెందినవారే వ్యవహరిస్తున్నారు. వారు చిత్తశుద్ధితో చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయకపోవడం వల్ల కూడా ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి.

మన దేశంలో చేనేత వస్త్రాలకు, ముఖ్యంగా చీరలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. మన దేశంలో తయారయ్యే చేనేత వస్త్రాలు నాణ్యమైనవిగా ప్రసిద్ధి. ముఖ్యంగా చేనేత చీరలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ప్రసిద్ధి పొందాయి. చేనేత వస్త్రాలు ధరించడం ఆరోగ్యానికి మంచిది కావడంతో వాటికి డిమాండ్ పెరుగుతోంది. చేనేత కార్మికులకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలనే చేనేత కార్మికులూ ఎదుర్కొంటున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో చేనేత కీలక భూమిక పోషించింది. చేనేత రంగంపై మన దేశంలో లక్షలాది మంది జీవిస్తున్నారు. అటువంటి చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్‌టీ విధించడం అత్యంత దారుణం. చేనేతకు ఉపయోగించే నూలుకు వేసే రంగులు, రసాయనాలపై 18 శాతం జీఎస్టీ విధించడంతో చేనేత వస్త్రాల ధరలు పెరిగిపోయాయి. కానీ, చేనేత కార్మికుల మజూరీలు పెరగలేదు. చేనేతను కుంగ దీస్తున్న, చేనేత కార్మికులకు తీవ్రమైన పోటీ ఇస్తున్న మరమగ్గాల వస్త్రాలపై 6 శాతం మాత్రమే జీఎస్టీ విధించారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని రద్దు చేయాలని దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు అనేక ఉద్యమాలు చేశారు. చేస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టి ప్రధానిమోదీకి లేఖలు రాశారు. చేనేత కార్మికులు అసంఘటితంగా ఉండటంతో ఉద్యమాన్ని రైతులు మాదిరిగా నిర్వహించలేకపోతున్నారు.

ఏపీ బడ్జెట్‌లో చేనేత రంగానికి ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. వైఎస్ఆర్ నేతన్న పథకానికి రూ.200 కోట్లు కేటాయించారు. అందులో రూ.3 కోట్లు వరకు ఉద్యోగుల జీతాలకు పోతాయి. రాష్ట్రంలో రెండు లక్షల మంది చేనేత కార్మికులు ఉంటే 81,700 మందికి మాత్రమే ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. ఈ పథకం వర్తించడానికి రూపొందించిన నిబంధనలు చాలా విచిత్రంగా ఉన్నాయి. సొంత ఇల్లు లేక అద్దెకు ఉండే ఇంట్లో మగ్గం ఉన్న కార్మికులకు మాత్రమే ఈ పథకాన్ని

వర్తింపజేశారు. ఇల్లు లేక మగ్గం కూడా పట్టే అంత ఇంటికి అద్దె చెల్లించలేక మగ్గాల షెడ్లలో అత్యంత దయనీయంగా బతికేవారికి మాత్రం ఈ పథకం వర్తించడంలేదు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికారులకు చేనేత రంగం గురించి తెలియకపోవడం, చేనేత కులాలకు చెందిన నేతలకు పరిస్థితులు వివరించే అవకాశం రాకపోవడం ప్రధాన సమస్యగా ఉంది.

రాష్ట్రంలో 950 వరకు చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో బోగస్ సంఘాలు అనేకం ఉన్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల నిజమైన చేనేత కార్మికులు కాకుండా ఈ బోగస్ సంఘాలు నాబార్డు రుణాలు, ప్రభుత్వ రాయితీల ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. తెలంగాణలో 615 చేనేత సహకార సంఘాలున్నాయి. నూలు, రంగులపై 40 శాతం రాయితీ ఇస్తున్నారు. ముఖ్యంగా కేరళలో చేనేత కార్మికులకు అనేక సౌకర్యాలు ఉన్నాయి. అక్కడ సహకార సంఘాల వ్యవస్థ పటిష్టంగా ఉంది. చేనేత కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు ఉన్నాయి. మహిళా చేనేత కార్మికులకు ప్రత్యేక సదుపాయాలు, సౌకర్యాలు ఉన్నాయి. మన ప్రభుత్వంలోని చేనేత నాయకులు అక్కడి సౌకర్యాలను అధ్యయనం చేసి, అమలు చేయవలసిన అవసరం ఉంది. తెలంగాణలో చేనేత మిత్ర పథకం కింద నూలు, రసాయనాలపై 50 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. ఇంటిల్లపాది రాత్రి, పగలు శ్రమించే చేనేత కార్మిక కుటుంబాలకు తగిన కూలి గిట్టదు. ప్రభుత్వాలు వారికి కావలసిన మార్కెటింగ్ వ్యవస్థను రూపొందించలేక పోతున్నాయి.

చేనేత కార్మికులకు, వినియోగదారునికి మధ్య ఉండే దళారీ వ్యవస్థను తొలగించి 'వీవర్ టు కస్టమర్' విధానంద్వారా నేతన్నలకు, వినియోగదారులకు ఉపయోపడే వ్యవస్థను రూపొందించాలని చేనేత కార్మిక నేతలు డిమాండ్ చేస్తున్నారు. చేనేత వస్త్రాలను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ వంటి ఆన్‌లైన్ మార్కెట్‌లో ఉంచాలని వారు కోరుతున్నారు. జీఎస్టీ నెంబర్ లేనిదే ఆన్‌లైన్‌లో అమ్మడం వీలుకాదు. ప్రభుత్వం ప్రత్యేక మార్కెటింగ్ వ్యవస్థను రూపొందించవలసి ఉంది. చేనేత వస్త్రాల ఉత్పత్తికి కావలసిన ముడి పదార్థాలు పత్తి ఉత్పత్తి నుంచి ఇతర అన్ని వనరులు ఇక్కడ పుష్కలంగా లభిస్తాయి. నైపుణ్యత కలిగిన శ్రామికులు ఉన్నారు. నిర్వహణ, సాంకేతికత రెండింటిలోనూ శిక్షణ పొందిన మానవ వనరులున్నాయి. ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రూపొందిస్తే చేనేత కార్మికుల బతుకులు ఎగుమతుల ద్వారా ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుతుంది. చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయించవలసిన అవసరాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి.

శిరందాసు నాగార్జున
సీనియర్ జర్నలిస్టు, 9440222914

లైంగిక వేధింపుల వివాదం

సుప్రీంను ఆశ్రయించిన రెజ్లర్లు

- బ్రిజ్‌భూషణ్‌పై దర్యాప్తుకు డిమాండ్
- రాజకీయ పార్టీలూ మద్దతివ్వొచ్చని స్పష్టీకరణ

న్యూదిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌కు వ్యతిరేకంగా వచ్చిన లైంగిక వేధింపులపై నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని భారత్‌లోని అగ్రశ్రేణి రెజ్లర్లు సోమవారం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేంత వరకు నిరసన కొనసాగిస్తామని రెజ్లర్లు స్పష్టం చేశారు. రెజ్లింగ్ క్రీడాకారులు మళ్లీ రోడ్డెక్కారు. డబ్ల్యూఎఫ్‌ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై దర్యాప్తు వివరాల్ని వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేస్తూ వరుసగా రెండో రోజు సోమవారం నిరసన దీక్ష కొనసాగించారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బజ్‌రంగ్ పునియా, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ సహా అగ్రశ్రేణి రెజ్లర్లు ఆదివారం నుంచి ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. రాత్రంతా దీక్షా శిబిరంలోనే ఉన్న క్రీడాకారులు...సోమవారం ఉదయం కూడా నిరసన కొనసాగించారు. బ్రిజ్‌భూషణ్‌పై పోలీసులు కేసు నమోదు చేసేంత వరకు తమ ఆందోళన విరమించబోమని కరాఖండిగా చెప్పారు. క్రీడామంత్రిత్వ శాఖ తప్పుడు హామీని నమ్మి గతంలో ఆందోళన విరమించామని, ఇప్పటి వరకు కేసు నమోదు చేయక పోగా విచారణ కూడా చేపట్టలేదని విమర్శించారు. ఇక ఎవరినీ గుడ్డిగా నమ్మాల్సిన అవసరం లేదన్నారు. బ్రిజ్‌భూషణ్‌పై సంచలన ఆరోపణలు చేస్తూ ఈ ఏడాది జనవరిలో రెజ్లర్లు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో రాజకీయ పార్టీలు వీరికి మద్దతు పలుకుతూ దీక్షలో కూర్చోవాలని ప్రయత్నించగా... క్రీడాకారులు అందుకు తిరస్కరించారు. అయితే, ఈసారి తాము అలా చేయబోమని బజరంగ్ పునియా తెలిపారు. తమ ఆందోళనకు మద్దతిచ్చేవారు ఎవరైనా తమతో పాటు ధర్నాలో కూర్చోవచ్చని చెప్పారు. 'ఈసారి అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నాం. బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ... ఏ పార్టీ అయినా సరే మాకు మద్దతిచ్చి దీక్షలో కూర్చోవచ్చు. అయితే, మాకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు' అని పునియా వివరించారు. 'గతంలో నిరసన చేపట్టినప్పుడు మమ్మల్ని తప్పుదోవ పట్టించారు. ఈసారి మేం ఎవర్నీ గుడ్డిగా నమ్మబోం. కేసు నమోదు చేసేంత వరకు దీక్ష కొనసాగుతుంది' అని వినేశ్ ఫొగాట్ తెలిపింది. బ్రిజ్‌భూషణ్‌పై ఓ మైనర్ సహా ఏడుగురు బాలికలు ఇటీవల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకోలేదని రెజ్లర్లు ఆరోపించారు. మరోవైపు, రెజ్లర్ల ఆరోపణలపై దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ నేతృత్వంలో ఏర్పాటైన ఆరుగురు సభ్యుల పర్యవేక్షక కమిటీ ఏప్రిల్ తొలి వారంలో దర్యాప్తు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ దర్యాప్తు నివేదికను ప్రభుత్వం ఇప్పటి వరకు బహిర్గతం చేయలేదు. దీంతో వారంతా మళ్లీ నిరసన బాటపట్టారు. ఈ క్రమంలోనే దిల్లీ పోలీసులు చర్యలు చేపట్టారు. రెజ్లర్లు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. క్రీడాశాఖ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి దర్యాప్తు నివేదిక కోరినట్లు పేర్కొన్నారు.

అమర జవాన్ల కోసం గ్రామస్థుల ప్రత్యేక ప్రార్థనలు

పూంచ్/జమ్ము: జమ్ముకశ్మీరులోని పూంచ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన ఐదుగురు జవాన్ల కోసం గ్రామస్థులు సోమవారం ప్రత్యేకప్రార్థనలు చేశారు. జవాన్ల మృతికి సంతాపంగా రంజాన్ పండుగను సైతం గ్రామస్థులు భారీగా జరుపుకోలేదు. స్థానిక రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ అధ్వర్యంలో ఇక్కడి ప్రజల కోసం ఇఫ్తార్ ఉత్సవాలు జరపడానికి ట్రక్కులో దీనికి సంబంధించిన వస్తు సామగ్రి తీసుకెళుతుండగా గురువారం ఉగ్రవాదులు దాడి చేశారు. సైనికుల మృతికి సంతాపంగా సంఘియోట్ గ్రామంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు సామాజిక కార్యకర్త అమీన్ ఖాన్ పీటీఐకి తెలిపారు. పొరుగున గల చండియాల్ పంచాయతీలోనూ ప్రత్యేక ప్రార్థనలు జరిగినట్లు చెప్పారు. సైనికులు మృతి చెందిన నాలుగో రోజు ముస్లింలు ప్రత్యేకంగా ఆ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో హిందువులు, సిక్కులు పాల్గొన్నారు. 'మా భద్రత కోసం సైనికులు ప్రాణాలో కోల్పోయారు. వారిని మేము స్మరించుకుంటున్నాం. పిరికిపందల చర్యకు పాల్పడిన ముష్కరులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం' అని ఖాన్ పేర్కొన్నారు. అమరుల కుటుంబాల బాధను తాము అర్థం చేసుకోగలమని, ప్రత్యేక ప్రార్థన ద్వారా తమ బాధను వారితో పంచుకుంటున్నామని ఆయన అన్నారు. 'జవాన్ల మృతికి మా గ్రామమంతా సంతాపం తెలుపుతోంది. సైనికులతో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. పండుగను సైతం జవాన్లకు సంతాప సూచకంగానే జరుపుకున్నాం' అని గ్రామస్థుడు అహ్మద్ చెప్పారు.

సర్కస్ దిగ్గజం శంకరన్ కన్నుమూత

కన్నూర్ (కేరళ): భారత సర్కస్ దిగ్గజం, జెమినీ సర్కస్ వ్యవస్థాపకుడు శంకరన్ (99) అనారోగ్యంతో ఆదివారం రాత్రి కన్నుమూశారు. వార్థక్యంతో తీవ్ర అనారోగ్యానికి గురైన శంకరన్ కొంతకాలంగా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించారు. భారతీయ సర్కస్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో శంకరన్ ప్రధాన పాత్ర పోషించారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కొనియాడారు. ప్రగతిశీల దృక్పథం ఉన్న శంకరన్‌తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. శంకరన్‌కు ప్రధానులు, రాష్ట్రపతులు, ఇతర ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. శంకరన్ మృతి దేశంలోని సర్కస్ కళకు తీరని లోటు అని విజయన్ పేర్కొన్నారు. 1924వ సంవత్సరంలో జన్మించిన శంకరన్ ప్రముఖ సర్కస్ కళాకారుడు కీలేరి కున్హికన్నన్ వద్ద మూడేళ్ల పాటు శిక్షణ పొందారు. తర్వాత సైన్యంలో చేరిన శంకరన్ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పదవీ విరమణ చేశారు.దేశవ్యాప్తంగా వివిధ సర్కస్ గ్రూపులతో కలిసి పనిచేసిన తర్వాత 1951వ సంవత్సరంలో విజయా సర్కస్ కంపెనీని కొనుగోలు చేసి జెమినీ సర్కస్‌గా పేరు మార్చారు. తర్వాత ఇతను తన రెండవ కంపెనీ జంబో సర్కస్‌ను ప్రారంభించారు.దేశంలో సర్కస్‌కు ఆయన చేసిన మొత్తం సహకారాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం అతన్ని జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించింది.శంకరన్‌కు ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె ఉన్నారు.

గత పాలకులు గ్రామాలను పట్టించుకోలేదు

ప్రధాని మోదీ

రేవా (మధ్య ప్రదేశ్): స్వాతంత్ర్యానంతరం దేశంలోని గ్రామాలకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు సవతి తల్లిలా వ్యవహరించాయని, వారి నమ్మకాన్ని వమ్ము చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఆరోపించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా రేవాలో జరిగిన బహిరంగ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం పరిస్థితిని మార్చి, పంచాయతీలకు భారీగా నిధులు పంపిణీ చేసిందని అన్నారు. అత్యధికంగా పాలించిన పార్టీ... గ్రామాల విశ్వాసాన్ని ఛిద్రం చేసి స్వాతంత్ర్యానంతరం సవతి తల్లిలా వ్యవహరించిందని మోదీ ఆరోపించారు. 'ప్రజలు, పాఠశాలలు, రోడ్లు, విద్యుత్, నిల్వ సౌకర్యాలు, గ్రామాల ఆర్థిక వ్యవస్థ... ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ప్రాధాన్యతలలో అట్టడుగున ఉంచబడ్డాయి' అని అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన తర్వాత ప్రధాని అన్నారు. ప్రభుత్వాలు గ్రామాలకు డబ్బు ఖర్చు చేయకుండా ఉండేవని, ఎందుకంటే గ్రామం ఓటు బ్యాంకు కాదని, అందుకే వాటిని పట్టించుకోలేదని తెలిపారు. గ్రామ ప్రజలను విభజించి అనేక రాజకీయ పార్టీలు తమ దుకాణాలను నడుపుతున్నాయని చెప్పారు. గ్రామాలకు జరిగిన ఈ అన్యాయాన్ని బీజేపీ అంతం చేసి, వారి అభివృద్ధికి మన ఖజానాను తెరిపించిందని అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా పంచాయతీ ప్రతినిధులు రేవాలో జరిగిన కార్యక్రమానికి వాస్తవంగా అనుసంధానం అయ్యారని అన్నారు. 'ఇది కచ్చితంగా భారతదేశ ప్రజాస్వామ్యానికి చాలా శక్తివంతమైన చిత్రం' అని తెలిపారు. 2014కి ముందు పదేళ్లలో అప్పటి కేంద్ర ప్రభుత్వాలు దాదాపు 6 వేల పంచాయతీ భవనాలు నిర్మించగా, తమ ప్రభుత్వం ఎనిమిదేళ్లలో 30 వేల కొత్త పంచాయతీ భవనాలను నిర్మించిందని మోదీ అన్నారు. 2014 నుంచి దేశం తన పంచాయతీల సాధికారత ప్రయత్నాన్ని చేపట్టిందని, దాని ఫలితాలు నేడు కనిపిస్తున్నాయన్నారు. ఇప్పుడు భారతదేశ పంచాయతీలు గ్రామాల అభివృద్ధికి జీవనాధారంగా ఎదుగుతున్నాయని ప్రధాని అన్నారు. ప్రస్తుత పాలనలో గ్రామీణ ప్రాంతాల డిజిటల్ అభివృద్ధిని ప్రస్తావిస్తూ, డిజిటల్ విప్లవం ఈ యుగంలో, పంచాయతీలను కూడా స్మార్ట్‌గా మారుతున్నాయని మోదీ అన్నారు. 'అభివృద్ధి చెందిన భారతదేశం కోసం దేశంలోని ప్రతి పంచాయతీ, ప్రతి సంస్థ, ప్రతి ప్రతినిధి, ప్రతి పౌరుడు ఏకం కావాలి. ఎలాంటి వివక్ష లేకుండా 100 శాతం లబ్ధిదారులకు ప్రాథమిక సౌకర్యాలు త్వరగా చేరినప్పుడే ఇది సాధ్యమవుతుంది' అని ప్రధాని మోదీ అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే పంచాయతీ వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆలోచనతో దేశంలోని పంచాయతీ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజల మద్దతు కారణంగా తన రేడియో ప్రసారమైన 'మన్ కీ బాత్' 100వ ఎడిషన్‌ను పూర్తి చేయబోతున్నట్లు ప్రధాని చెప్పారు.

పాట్నా హైకోర్టులో రాహుల్‌గాంధీకి ఊరట

పాట్నా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పాట్నా హైకోర్టులో ఊరట లభించింది. మోదీ అనే ఇంటిపేరును కించపర్చారని బీహార్‌కు చెందిన రాజ్య సభ సభ్యుడు సుశీల్ కుమార్ మోదీ దాఖలు చేసిన పిటిషన్‌పై పాట్నాలోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు...రాహుల్ గాంధీ ఏప్రిల్ 25వ తేదీన తమ ఎదుట హాజరుకావాలని మార్చి 30న సమన్లు జారీ చేసింది. వాస్తవానికి మార్చి 18నే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు... ఏప్రిల్ 12న రాహుల్ కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. అయితే, ప్రస్తుతం సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ వ్యవహారంలో తాము బిజీగా ఉన్నందున విచారణ వాయిదా వేయాలని రాహుల్ న్యాయవాదుల బృందం కోర్టును కోరింది. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం...ఏప్రిల్ 25వ తేదీకి విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ పాట్నా హైకోర్టును ఆశ్రయించారు. ఇక్కడ రాహుల్ తరఫున న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం దిగువ కోర్టు ఆదేశాలపై మే 15వ తేదీ వరకు స్టే విధించింది. దీనిపై బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సుశీల్ కుమార్ మోదీ మాట్లాడుతూ తాను వేసిన దావాలో కూడా రాహుల్‌గాంధీకి తగిన శిక్షపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వివిధ ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వ్యాపారవేత్తలు లలిత్ మోదీ, నీరవ్ మోదీ గురించి 2019 ఎన్నికల ప్రచారం వేళ కర్నాటకలోని కోలార్‌లో రాహుల్ ప్రస్తావించారు. మోదీ అనే పేరు గురించి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ గుజరాత్‌లోని సూరత్‌లో పరువునష్టం దావా దాఖలైంది. దీనిపై ఇటీవల విచారణ జరిపిన సూరత్ కోర్టు... రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వెలువడిన 24 గంటల్లోపే ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనల మేరకు లోక్‌సభ సచివాలయం ఆయనపై అనర్హత వేటు వేసింది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయింది.

పెండింగ్ కేసులపై ఇంటర్వ్యూ ఇచ్చే పని జడ్జికి లేదు: సుప్రీం

న్యూదిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో సంచలనం సృష్టించిన 'స్కూల్ ఉద్యోగానికి లంచం' వ్యవహారానికి సంబంధించిన పెండింగ్ కేసు గురించి ఒక న్యూస్ ఛానెల్‌కి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ ఏమైనా ఇంటర్వ్యూ ఇచ్చారో లేదో నాలుగు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కలకత్తా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి ఒక న్యూస్ ఛానెల్‌కు జస్టిస్ గంగోపాధ్యాయ ఇంటర్వ్యూ ఇవ్వడాన్ని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. 'జడ్జికి పెండింగ్ కేసుల గురించి ఇంటర్వ్యూ ఇచ్చే పని లేదు' అని స్పష్టం చేసింది. గురువారం లేదా అంతకు ముందు న్యాయమూర్తి సూచనలను స్వీకరించిన తర్వాత నివేదికను దాఖలు చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ధర్మాసనం కోరింది. అలాగే టీఎంసీ నాయకుడు అభిషేక్ బెనర్జీ అభ్యర్థనపై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న బెనర్జీ, కుంతల్ ఘోష్‌లను విచారించి, దాని ఆధారంగా నివేదికను దాఖలు చేయాలని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఆదేశిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఏప్రిల్ 13 నాటి ఉత్తర్వులపై ఏప్రిల్ 17న సుప్రీం కోర్టు స్టే విధించిన సంగతి విదితమే. దీనికి ముందు, కలకత్తా హైకోర్టు జస్టిస్ గంగోపాధ్యాయ సింగిల్ జడ్జి బెంచ్ కూడా సీబీఐపై ఎటువంటి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయవద్దని పశ్చిమ బెంగాల్ పోలీసులను ఆదేశించింది. ఈ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారణ చేపట్టారు.

అతీఖ్, అష్రఫ్ హత్యపై 'సుప్రీం'లో పిటిషన్

న్యూదిల్లీ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, రాజకీయ నేత అతీక్‌తో పాటు అతని సోదరుడి హత్యలపై మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. ఈ కేసును ఈ నెల 28న జాబితా చేయాలని ఆదేశించింది. అదే సమయంలో 2017 నుంచి యూపీలో జరిగిన 183 ఎన్‌కౌంటర్లపై విచారణ జరపాలని కూడా పిటిషనర్ కోరారు.పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ జరిపించాలని న్యాయవాది విశాల్ తివారి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ఎదుట ప్రస్తావించారు. అయితే, ఐదుగురు న్యాయమూర్తులు అస్వస్థతకు గురై వారు అందుబాటులో లేకపోవడంతో చాలా అంశాలు లిస్ట్ కాలేదని చంద్రచూడ్ తెలిపారు. ఈ అంశాన్ని 28న లిస్ట్ చేయాలని కోర్టు ఆదేశించింది. గ్యాంగ్‌స్టర్ అతీఖ్ అతని సోదరుడు అష్రఫ్‌ను ఈ నెల 15న రాత్రి పోలీసులు ప్రయాగ్‌రాజ్‌లోని ఒక ఆసుపత్రికి తీసుకెళ్తుండగా జర్నలిస్టుల పేరుతో వచ్చి కాల్పులు జరపడంతో మృతిచెందిన విషయం తెలిసిందే.

కేశవానంద భారతి కేసు...

చారిత్రక తీర్పునకు 50 ఏళ్లు

వెబ్ పేజీని ప్రజలకు అంకితమిచ్చిన సుప్రీం



న్యూదిల్లీ: రాజ్యాంగ మౌలిక స్వరూపం, పౌరుల ప్రాథమిక హక్కులకు సంబంధించి అత్యంత కీలకమైన కేసుగా కేశవానంద భారతి కేసు న్యాయచరిత్రలో నిలిచింది. కేరళ భూసంస్కరణల చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఆ కేసులో వచ్చిన తీర్పు... తదనంతరం ఎన్నో కేసులకు దిక్సూచిగా నిలుస్తోంది. 'కేశవానంద భారతి వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ'గా ప్రాచుర్యం పొందిన ఈ కేసు తీర్పు వెలువడి ఏప్రిల్ 24తో 50 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు వాదనలు, లిఖిత పూర్వక ప్రతులతోపాటు చరిత్రాత్మక తీర్పుతో ఓ ప్రత్యేక వెబ్ పేజీని సుప్రీంకోర్టు రూపొందించింది. ఈ వెబ్ పేజీని సోమవారం న్యాయశాస్త్ర పరిశోధకులు, ప్రజలకు సుప్రీంకోర్టు అంకితమిచ్చింది. యావత్ ప్రపంచ పరిశోధకులు చూసేందుకు వీలుగా కేశవానంద భారతి కేసుకు సంబంధించి ఉన్న అన్ని లిఖిత పూర్వక పత్రాలతో కూడిన ఓ వెబ్‌పేజీని ఏర్పాటు చేశాం. 50ఏళ్ల క్రితం ఇదే రోజున (ఏప్రిల్ 24, 1973) దీనికి సంబంధించిన తుది తీర్పు వెలువడిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. దీంతో కోర్టు హాలులో ఉన్న న్యాయవాదులందరూ హర్షం వ్యక్తం చేశారు. పరిశోధకులు, విద్యార్థులు, న్యాయవాదులకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు.

కేసు వివరాలు...

కేరళ ప్రభుత్వం ఆశ్రమాల ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆధ్యాత్మిక గురువు కేశవానంద భారతి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో భాగంగా పార్లమెంటు చేసిన 24, 25, 29వ రాజ్యాంగ సవరణల చెల్లుబాటును ఆయన సవాలు చేశారు. ఈ సవరణలు న్యాయవ్యవస్థ అధికారాలతోపాటు పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై 1972 అక్టోబర్ 31న ప్రారంభమైన విచారణ 1973 మార్చి 24 వరకు సాగింది. అప్పట్లో ఈ కేసును 13 మంది న్యాయమూర్తుల ధర్మాసనం విచారించింది. ఒక కేసు విచారణ కోసం 13 మంది న్యాయమూర్తులతో విస్తృత ధర్మాసనం ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు చరిత్రలో ఇదే తొలిసారి. అయితే, విచారణ సందర్భంగా రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలు, మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు పార్లమెంటుకు ఉందా? లేదా? అనే ప్రశ్న తెరమీదకు వచ్చింది. 68 రోజుల పాటు సుదీర్ఘ విచారణ జరిపిన విస్తృత ధర్మాసనం... రాజ్యాంగ మౌలిక సిద్ధాంతానికి సుప్రీంకోర్టు సంరక్షణదారు అని చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఏ విషయంలోనైనా సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ... మౌలిక స్వరూపాన్ని, ప్రాథమిక హక్కులను మార్చలేదని తెలిపింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం వాటి సంరక్షణ బాధ్యత చూస్తుందని స్పష్టం చేసింది. దీనర్థం.. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య, చట్టం అందరికీ సమానం వంటివి రాజ్యాంగ ప్రాథమిక సూత్రాల మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని తెలిపింది.

అమృత్‌పాల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు

చండీగఢ్: పంజాబ్‌లోని మోగా జిల్లాలో అరెస్టు చేసిన ఒక రోజు తర్వాత, వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ 'అక్రమ నిర్బంధం'లో ఉన్నాడని పేర్కొంటూ గత నెల దాఖలు చేసిన ఒక పిటిషన్ పిటిషన్‌ను పంజాబ్, హరియాణా హైకోర్టు సోమవారం కొట్టివేసింది. అమృత్‌పాల్ సింగ్, అతని సంస్థ 'వారిస్ పంజాబ్ దే' న్యాయ సలహాదారు ఇమాన్ సింగ్ ఖరా మార్చి 19న బోధకుడిని పోలీసు కస్టడీ నుంచి హాజరుపరచాలని కోరుతూ హెబియస్ కార్పస్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అంతకుముందు కోర్టు విచారణలలో పంజాబ్ రాష్ట్రం అమృత్‌పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకోలేదని లేదా అరెస్టు చేయలేదని పేర్కొంది. రాడికల్ బోధకుడు అక్రమ కస్టడీలో ఉన్నట్లు ఆధారాలు చూపాలని పిటిషనర్‌ను కోర్టు కోరింది. పంజాబ్ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున మోగా జిల్లాలోని రోడే గ్రామంలో అమృత్‌పాల్ సింగ్‌ను అరెస్టు చేశారు. ఖలిస్తానీ ఉగ్రవాది జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలేను చంపిన తర్వాత తనకు తాను రాడికల్ బోధకుడిగా చెప్పుకున్న అమృత్‌పాల్ సింగ్‌పై నెల రోజుల పాటు సాగిన వేటను ముగించారు. అమృత్‌పాల్ సింగ్‌ను ఇప్పుడు జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద నిర్బంధించి, ఏప్రిల్ 23న అసోంలోని డిబ్రూగఢ్ సెంట్రల్ జైలుకు పంపినందున, పిటిషన్ విఫలమైందని విచారణ అనంతరం ఖరా విలేకరులతో అన్నారు. అమృత్‌పాల్ సహచరులు దల్జిత్ సింగ్ కల్సి, గుర్మీత్ సింగ్, కుల్వంత్ సింగ్, వరీందర్ సింగ్ ఫౌజీ, భగవంత్ సింగ్ పర్ధన్ మంత్రి బజేకే, బసంత్ సింగ్ బంధువులు దాఖలు చేసిన పిటిషన్ల విషయంలో జస్టిస్ ఎన్.ఎస్. షెకావత్ ధర్మాసనం తదుపరి విచారణ తేదీని మే 1గా నిర్ణయించింది. కాగా ఎన్ఎస్ఏ ఖైదీల బంధువులు నిర్బంధ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. కల్సి భార్య తరపు న్యాయవాది సిమ్రంజిత్ సింగ్, తాము సవరించిన పిటిషన్‌ను దాఖలు చేయాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. పిటిషనర్ ఇప్పుడు నిర్బంధ ఉత్తర్వులకు గల కారణాలను సవాలు చేస్తారని ఆయన అన్నారు. కల్సి భార్య తన భర్తను పంజాబ్ పోలీసులు అన్యాయంగా, అక్రమంగా నిర్బంధించారని, ఎటువంటి చట్టపరమైన సరైన కారణం, సరైన ప్రక్రియ లేకుండా డిబ్రూగఢ్‌లోని సెంట్రల్ జైలుకు పంపబడ్డారని ఆరోపించారు.

మహిళా స్వావలంబనలో పాడి పరిశ్రమ పాత్ర కీలకం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

కర్నాల్ (హరియాణా): మహిళల్ని ఆర్థికంగా శక్తిమంతుల్ని చేయడంలో పాడి పరిశ్రమ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఇక్కడి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్-నేషనల్ డైరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఏఆర్-ఎన్‌డీఆర్‌ఐ) స్నాతకోత్సవంలో ముర్ము మాట్లాడుతూ...పాడి పరిశ్రమ (డెయిరీలు) రంగంలో మహిళలు 70 శాతానికి పైగా భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నారని, అందుచేత ఈ రంగంలో కొత్త వెంచర్లను స్థాపించడానికి వారికి సులభంగా రుణాలు, మార్కెట్ సౌలభ్యం కల్పించాలని, విద్య, శిక్షణ, నైపుణ్యాభివృద్ధిలో వారికి మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. భారతదేశంలోని పాడి పరిశ్రమాభివృద్ధిలో మహిళా శక్తి కీలక పాత్ర పోషిస్తుందని, మహిళల స్వావలంబనతో పాటు వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చడంలో పాడి పరిశ్రమ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని ముర్ము అన్నారు. స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలు, పతకాలు అందుకున్నన్న విద్యార్థులను రాష్ట్రపతి అభినందిస్తూ... డిగ్రీలు అందుకున్న విద్యార్థుల్లో మూడింట ఒక వంతు మంది బాలికలే కావడం, బంగారు పతకాలు పొందిన వారిలో కూడా 50 శాతం మంది అమ్మాయిలే ఉండడం సంతోషం చదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో 544 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. దేశంలో పెరుగుతున్న జనాభా కారణంగా, పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోందని ముర్ము చెప్పారు. 'నాణ్యమైన పశుగ్రాస లభ్యత, వాతావరణ మార్పులు, పశువుల వ్యాధుల కారణంగా వాతావరణంలో మార్పు వంటి సవాళ్లను డెయిరీ రంగం ఎదుర్కొంటోంది. పాలఉత్పత్తి, పాడిపరిశ్రమను నిలకడగా మార్చడం మన ముందున్న సవాల్... జంతు సంరక్షణను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ అనుకూల స్మార్ట్ టెక్నాలజీలను అవలంబించడం ద్వారా పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడం మనందరి బాధ్యత' అని ఆమె అన్నారు. హరిత విప్లవంతో పాటు శ్వేత విప్లవం విజయవంతం కావడంలో పంజాబ్, హరియాణా రైతులు ప్రత్యేక పాత్ర పోషించారని, రైతులందరికీ నా పాదాభివందనం అని ఆమె అన్నారు. పాలు, పాల ఉత్పత్తులు ఎల్లప్పుడూ భారతీయ ఆహారం, సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్నాయని, తల్లి పాలతో పాటు ఆవు పాలను కూడా ఆరోగ్యానికి అమృతంగా పరిగణిస్తారని ఆమె తెలిపారు. ఆవులు, ఇతర పశువులు భారతీయ సమాజం, సంప్రదాయాలలో అంతర్భాగంగా ఉన్నాయ న్నారు. దేశ ఆహార, పోషకాహార భద్రతను నిర్ధారించడంలో పాడి పరిశ్రమ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ముర్ము చెప్పారు. ప్రపంచంలోనే అత్యధికంగా పాల ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్ కావడం గర్వించదగ్గ విషయమని, ప్రపంచ పాల ఉత్పత్తిలో దాదాపు 22 శాతం వాటాను కలిగి ఉందని ఆమె అన్నారు. 'దేశ జీడీపీకి డెయిరీ రంగం సుమారు 5 శాతం అందిస్తుంది...భారతదేశంలో సుమారు ఎనిమిది కోట్ల కుటుంబాలకు జీవనోపాధిని అందిస్తుంది. అందువల్ల, దేశ సమగ్ర అభివృద్ధిలో ఐసీఏఆర్-ఎన్‌డీఆర్‌ఐ వంటి సంస్థలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి' అని ఆమె అన్నారు. 1923లో స్థాపించబడిన ఎన్‌డీఆర్‌ఐ భారతదేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి గణనీయమైన కృషి చేసిందని ఆమె ప్రశంసిం చారు. అధిక పాలను ఇచ్చే గేదెలు, ఆవుల క్లోన్‌లను ఉత్పత్తి చేసే సాంకేతికతను ఎన్‌డీఆర్‌ఐ అభివృద్ధి చేసిందని, ఇది జంతువుల పాల ఉత్పత్తి సామర్థ్యాన్ని అలాగే రైతుల ఆదాయాన్ని పెంచుతుందని ఆమె అన్నారు. విద్యార్థులు ఎప్పుడూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలని ముర్ము కోరారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మోదీ విధానాలపై దేశవ్యాప్త పోరు

రావుల వెంకయ్య పిలుపు

విశాలాంధ్ర - కాకినాడ: ప్రధాని మోదీ అనుస రిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్ని చైతన్యవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. స్థానిక బాలాజీచెరువు సెంటర్‌వద్ద సోమవారం జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చి 9ఏళ్లు పూర్తయి నప్పటికి అధికారంలో వచ్చేముందు చేసిన వాగ్దానాలు ఒక్కటి కూడా అమలుచేయలేదన్నారు. కార్పొరేట్ శక్తులను కాపాడేందుకునే మోదీ తాపత్రయపడుతున్నారని విమర్శిం చారు. ఉద్యోగకల్పన చేస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని, చెప్పిన మాటలు ఆచరణలో పెట్టని మోదీని విద్యావంతులు, మేధావులు నిలదీయాలని కోరారు. దేశంలో కోటీశ్వరులకు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేందుకే మోదీ కంకణం కట్టుకున్నారన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కి ప్రజాసామ్య విలువలను హరిస్తున్నారన్నారు. మోదీ దుష్టపాలనకు చరమగీతం పాడాలని, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ విభజన హామీలపై నోరెత్తలేని పరిస్థితి తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ దిల్లీ వెళ్లినప్పుడు తనపై ఉన్న కేసుల రద్దు, బాబాయి హత్యకేసులో అవినాశ్‌ను రక్షించే ప్రయత్నాలు మినహా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అంశాలు సాధించలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తాటి పాక మధు, జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఏఐటీయూసీ నాయకుడు పీఎస్ నారాయణ, సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో

కోట్లకు పడగలెత్తిన కుబేరులకు తప్ప సామాన్య ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని రైతులు, కార్మికులు, యువకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనపై విసుగెత్తిపోయారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతు పలికి ప్రజలపై పన్ను భారాలు వేయటమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను కమ్యూనిస్టులు నిరంతరం వ్యతిరేకిస్తారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, మాట్లాడుతూ జిల్లాలో పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతి అయిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు, సయ్యద్ మౌలాలి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, పూస వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అభివృద్ధి శూన్యం : ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కనిగిరి: మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి శూన్యమని, ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, రక్షణ, ఎల్ఐసి, బ్యాంకులు, ఓడరేవులు, వ్యవసాయం కార్పొరేట్ వ్యక్తులైన ఆదానీ, అంబానీలకు గంపగుత్తగా అమ్మేస్తున్నారని.. గో రక్షణ పేరుతో నిత్యం మైనార్టీలు, దళితులపై దాడులు తెగబడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి క్లబ్ రోడ్‌లో సోమవారం నిర్వహించిన ప్రచార భేరి కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో వ్యవసాయాన్ని సైతం మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ధారా దత్తం చేస్తోందని విమర్శించారు. దేశంలోని అత్యంత విలువైన అడవులను, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, గనులను కార్పొరేటర్లకు అక్రమంగా కట్టబెడుతోందన్నారు. పేదలకు సామాన్య ప్రజలకు అండదండలుగా ఉండాల్సిన ప్రభుత్వం వారి మీదే మోయలేనంత భారాలను మోపుతోందని విమర్శించారు. సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ఇన్చార్జి కార్యదర్శి టీ తాతయ్య, సీపీఎంజిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు ప్రసంగించారు. తొలుత సీపీఐ నాయకులు పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా సభాస్థలికి చేరుకున్నారు. అనంతరం ప్రచార భేరి కరపత్రాలను పంపిణీ చేశారు.

బీజేపీని పారద్రోలి ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర- కూచిపూడి: ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని పారద్రోలి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడి సెంటర్లో సోమవారం సాయంత్రం నిర్వహించిన" ప్రచార భేరి"కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సభకు సీపీఐ మండల కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, సీపీఎం మండల నాయకుడు పెద్దముత్తేవి శ్యాంసన్ అధ్యక్షతవహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను, ఓడరేవులనే కాకుండా అందరికీ అన్నం పెట్టే

లౌకికతత్వాన్ని కాపాడుకుందాం: దోనేపూడి

విశాలాంధ్ర-విజయవాడ: అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లు రద్దుచేస్తామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలతో దళితులు, మైనార్టీలు అభద్రతకు లోనవుతున్నారనీ, లౌకికతత్వంపై బీజేపీ నిబద్ధత బయట పడిన నేపథ్యంలో దేశంలో లౌకికతత్వాన్ని కాపాడుకోవటం కోసం బీజేపీపై కమ్యూనిస్టు పార్టీలు చేస్తున్న పోరాటంలో ప్రజలు కలిసి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. మోదీ హఠావో! దేశ్ కి బచావో!! నినాదంతో సీపీఐ,సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి 9వ రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక పాతరాజరాజేశ్వరిపేటలో సోమవారం జరిగిన ప్రచార భేరిలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరిస్తూ రిజర్వేషన్లు ఎత్తివేయటానికి ప్రయత్నిస్తోందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు మోదీ చెప్పే డబుల్ ఇంజన్, జగన్ చెప్పిన బాదుడే బాదుడు అంశాలు రాష్ట్ర ప్రజలపై డబుల్ బాదుడుగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం: రామాంజనేయులు

విశాలాంధ్ర - డోన్ : సీపీఐ జాతీయ పిలుపులో భాగంగా నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో మహాలక్ష్మి హాస్పిటల్ వీధి, కొత్తపేట, కూరుకుంద కాలనీ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాం జనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు. ఎం రాముడు,మండల కార్యదర్శి ఎస్ పులిశేఖర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని,ప్రతి వ్యక్తి గొంతు ఎత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం ఇదేనన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై మరో పోరాటానికి పిడికిలి బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు దేవమణి, హసీనా ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రామ్మోహన్, రైతు సంఘం నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో

కూచిపూడిలో

డోన్‌లో

అమిత్ షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకం

రాజకీయ లబ్ధి కోసం తప్పుడు వాగ్దానాలు

సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర- విజయవాడ: భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడం ప్రజా స్వామ్యానికి,లౌకిక వ్యవస్థకు వ్యతిరేకంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక వీడియో విడుదల చేస్తూ కేంద్రంలో బాధ్యతాయుతంగా ఉండాల్సిన హోంమంత్రి మతతత్వాలు రెచ్చగొట్టేలా మాట్లాడడం విచారకరం అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్ తీసేస్తామని ఆదివారం చేవెళ్లలో జరిగిన సభలో అమిత్ షా చెప్పడాన్ని నారాయణ తప్పుబట్టారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగత్ అన్ని మతాల్ని, కులాలను కలుపుకుని పోవాలని కీలక సమావేశాల్లో చెప్పారన్నారు. అధికారం కోసం పాకులాడే వారు రాజకీయాల్లో విమర్శలు చేసుకోవచ్చు అన్నారు.అలా కాకుండా మతతత్వాలు రెచ్చగొట్టడం ఏంటని ప్రశ్నించారు. గతంలో సీపీఐ అగ్రనాయకులు చంద్ర రాజేశ్వరరావు ముస్లింల స్థితిగతులు పరిశీలించినప్పుడు దళితులు, గిరిజనుల కంటే ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని పరిశీలన చేసి చెప్పారని ఈ సందర్భంగా నారాయణ గుర్తుచేశారు. సచార, శ్రీరంగరాజ కమిటీ పరిశీలనలో కూడా ముస్లింలు ఎక్కువ శాతం పేదరికంలో ఉన్నారని నివేదిక ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో 5 శాతం నుంచి4 శాతంకు రిజర్వేషన్లు తగ్గించినట్లు చెప్పారు. క్రిమినల్ బ్యాగ్రౌండ్ ఉన్న హోం మంత్రి అమిత్ షా మతతత్వాలు రెచ్చగొట్టేలా మాటాడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నదని నారాయణ తెలిపారు.

అరిచేతికి అద్దం ఎందుకు?: రాష్ట్ర మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసు ఇన్ని సుడులు తిరగాల్సిన అవసరం లేదని ఒక ప్రకటనలో నారాయణ పేర్కొన్నారు. కేంద్రం అండతో రకరకాల కుయుక్తులతో కాలం గడిచినా చివరికి ఉన్నత ధర్మాసనం చొరవతో ఒక కొలిక్కి వస్తుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఇక 'సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ'

పేరు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సి.రాఘవా చారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ పేరును ఇకపై సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు అకాడమీ పేరులో ప్రాతినిధ్యం ఉండేలా పేరు మార్పు చేయాల్సిందిగా తాము కోరిన మీదట రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులు వెలువరించిందని సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పేరు మార్చి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సముచిత ప్రాధాన్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి, సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్ రెడ్డికి కొమ్మినేని శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి శనివారం ఆన్‌లైన్‌లో అవగాహన తరగతులు

డిప్లొమా ఇన్ జర్నలిజం అభ్యర్థులతో పాటు వర్కింగ్ జర్నలిస్టులకు ఆన్‌లైన్ అవగాహన తరగతులను నిపుణులతో నిర్వహించనున్నట్లు కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి శనివారం ఎంపిక చేసిన అంశంపై ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టు లందరూ ఆన్‌లైన్ విధానంలో హాజరుకావచ్చని ఆయన తెలిపారు. డిప్లొమా ఇన్ జర్నలిజం క్లాసులు మే 1వ తేదీ నుంచి మొదలుకానున్నందున మే మొదటి శనివారం 6వ తేదీన 'సాహిత్యం- సమాజం' అనే అంశంపై ప్రసిద్ధ సాహితీవేత్త ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ ప్రసంగం ఉంటుందని ఛైర్మన్ తెలిపారు. డిప్లొమా కోర్సుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నర్స్ సపోర్ట్ సర్వీసెస్ బ్రాంచ్ డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డి కోర్సు కోఆర్డినేటర్‌గా వ్యవహరి స్తుండగా, నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగపు అధిపతి డా. జి.అనిత, ఆంధ్రా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగపు రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు బాబీ వర్ధన్ సహకారం అందిస్తున్నట్లు కొమ్మినేని తెలిపారు.

కార్మిక వ్యతిరేక నిర్ణయం

పనిగంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

స్టాలిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఏఐటీయూసీ

న్యూదిల్లీ: తమిళనాడు ప్రభుత్వంపై ఏఐటీయూసీ ఆగ్రహం వ్యక్తంచేసింది. రోజువారీ పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచుతూ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. తమిళ నాడు అసెంబ్లీ ఆమోదించిన ఫ్యాక్టరీస్ (తమిళ నాడు సవరణ) బిల్లు 2023ను ఏఐటీయూసీ తిరస్కరిం చింది. ఫ్యాక్టరీ కార్మికుల పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచుతూ స్టాలిన్ ప్రభుత్వం సవరణ తీసుకురావడాన్ని ఏఐటీ యూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. 'అసెంబ్లీలో చర్చ జరపలేదు. కార్మిక సంఘాలను సంప్రదించలేదు. కానీ స్టాలిన్ ప్రభుత్వం ఏకపక్షంగా బిల్లును ఆమోదింపచేసుకుంది. ఇది అత్యంత దురదృష్టకరం. ఆశ్చర్యమేమంటే సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే సహా డీఎంకే మిత్రపక్షాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించినా బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. పరిశ్రమలు, వాటి సంఘాల అభ్యర్థన మేరకు సవరణలు తీసుకొచ్చినట్లు బిల్లులోనే పేర్కొన్నారు. ఈ సవరణ కంపెనీ యజమాని, కార్పొరేట్ శక్తుల అనుకూలం. కార్మిక వ్యతిరేకం. ఫ్యాక్టరీలకు సాధికారత కల్పించడం స్టాలిన్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. కార్మికులను దోచు కోవడం, వారి ఆరోగ్యాన్నిప ఏమాత్రం పట్టించు కోకుండా చేయడం, కార్మికులపై మానసిక ఒత్తిడి పెంచడం వంటి నిబంధనలు ఉల్లంఘించినా యాజమాన్యాలపై చర్యలు తీసుకునే అవకాశం లేకుండా తమిళనాడు ప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టి...ఫ్యాక్టరీ యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చడం బిల్లు లక్ష్యంగా ఉంది. పనిగంటల పెంపునకు తీసుకొచ్చిన సవరణ కార్మికుల వేతనాలు, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కార్మికుల హక్కులు

పణంగా పెట్టి మోదీ సర్కారు నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిన విధంగానే తమిళనాడు ప్రభుత్వం ఈ సవరణలు చేపట్టింది. ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోక పోవడం దుర్మార్గం. కార్మిక వ్యతిరేక సవరణను స్టాలిన్ ప్రభుత్వం ఇంత హడావుడిగా ఎందుకు తీసుకొచ్చిందో...అసెంబ్లీలో ఎందుకు ఆమోదం పొందేలా చేసిందో అర్థం కావడం లేదు. సుదీర్ఘ గంటలు పనిచేయడం వల్ల వయస్సు, లింగంతో తేడా లేకుండా కార్మికులు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతారు. ఇలాంటి చట్టాలను కార్మికులు, కార్మి సంఘాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమ తించవు. కార్మిక వ్యతిరేక చర్యలను ఏఐటీయూసీ నిరంతరం వ్యతిరేకిస్తుంది' అని అమర్‌జిత్ కౌర్ స్పష్టం చేశారు. ఇలాంటి కార్మిక వ్యతిరేక చట్టా లను రాష్ట్రస్థాయిలోనూ, ఫ్యాక్టరీల స్థాయిలోనూ ఉమ్మడి కార్యాచరణ ద్వారా తిరస్కరించడం, వ్యతిరేకించడానికి కార్మికులు, ప్రత్యేకించి తమిళ నాడు కార్మి కులు, కార్మికసంఘాలు ఐక్యంగా పోరాడాలని ఏఐటీయూసీ పిలుపునిచ్చింది. స్టాలిన్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగిన తమ అనుబంధ కార్మిక సంఘాలకు ఏఐటీ యూసీ అభినందనలు తెలిపింది. డీఎంకే ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యపై నిరసనలు కొనసాగించాలని పిలుపునిచ్చింది. మే 12వ తేదీన ఒకరోజు సమ్మె నిర్వహించాలని తమిళ నాడు కార్మిక సంఘాలు తీసుకున్న ఉమ్మడి నిర్ణయానికి సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ప్రక టించింది. తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డీఎంకే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

మేలో రైతు భరోసా

వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద కిసాన్ డ్రోన్లు

సమీక్షలో సీఎం జగన్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పథకం కింద రైతులకు నిధులు జమ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖలపై ముఖ్యమంత్రి సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. మంత్రులు కాకాని గోవర్దనరెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, సీఎస్ జవహర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రబీలో ఈ-క్రాప్ బుకింగ్‌పై అధికారులు సీఎంకు వివరాలు అందించారు. 3953 ఆర్బీకే స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్(సీహెచ్‌సీ)లకూ, 194 క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలకూ మే 20 లోగా వైయస్సార్ యంత్రసేవ కింద వ్యవసాయ ఉపకరణాలు అందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. వైయస్సార్ యంత్రసేవా పథకం కింద జులై నాటికి 500 కిసాన్ డ్రోన్లు, డిసెంబర్ నాటికి 1500కు పైగా డ్రోన్లు ఇచ్చే దిశగా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అయితే, ఖరీఫ్ ప్రారంభానికి ముందు అంటే మే నెలలో రైతు భరోసా నిధులు ఇచ్చేందుకు సిద్ధం కావాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. మే 10 నాటికి అర్హులైన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తామని అధికారులు సీఎంకు తెలిపారు. 467 వీఏఏ,

1644 వీహెచ్ఏ, 23 వీఎస్ఏ, 64 వీఎఫ్ఏ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పశు సంవర్ధశాఖలో 4656 అసిస్టెంట్ల పోస్టుల భర్తీకీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి దాదాపుగా చెల్లింపులు పూర్తయ్యాయని, రూ.7233 కోట్లకుగానూ రూ.7200 కోట్లు చెల్లించినట్లు అధికారులు వివరించారు. ఖాతాల్లో సాంకేతిక ఇబ్బందుల కారణంగా రూ.33 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక గోడౌన్ ఉండాలని సీఎం సూచించారు. 1005 చోట్ల గోడౌన్ల నిర్మాణం చేపట్టామని అధికారులు తెలిపారు. వీటిలో 206కు పైగా పూర్తయ్యాయని, మరో 93 గోడౌన్లు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు చెప్పారు. సమీక్షలో మంత్రులు కాకాని గోవర్దనరెడ్డి, కారుమూరి వెంకట నాగేశ్వరరావుతోపాటు ఏపీ అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, ఏపీ వ్యవసాయశాఖ సలహాదారు ఐ.తిరుపాల్ రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, మార్కెటింగ్, సహకార శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే, ఉద్యానవనశాఖ కమిషనర్ ఎస్.ఎస్ శ్రీధర్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఎండీ అండ్ వీసీ జి.శేఖర్ బాబు, ఏపీ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్ వీసీ అండ్ ఎండీ జి.వీరపాండ్యన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది

రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కేంద్రంలో బీజేపీ పాలనలో దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్వర్యంలో సోమవారం సాయంత్రం విజయవాడ జింఖానా గ్రౌండ్స్ మైదానంలో జై భారత్ సత్యాగ్రహ సభ నిర్వహించింది. ఈ సందర్భంగా కేవీపీ మాట్లాడుతూ 2014 నుంచి 2020 వరకూ రాజ్యసభలో తాను మన రాష్ట్రం తరపున హక్కుల కోసం, ప్రజా సమస్యలపై పోరాటం చేశానని తెలిపారు. కేంద్రంలో ఉన్మాద మనస్తత్వం కలిగిన ఒక ప్రభుత్వాన్ని మనం ఎదుర్కొంటున్నామన్నారు. మన దేశ అప్పులు లక్షల కోట్లు పెరుగుతుంటే, అదానీ ఆస్తులు మాత్రం భారీగా పెరుగుతున్నాయన్నారు. అదానీని ప్రశ్నిస్తే దేశద్రోహం కింద పరిగణిస్తున్నారన్నారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగంలో ఒక్కటి కూడా తప్పుడు మాట లేదని, అదానీ గురించి మాత్రమే ప్రశ్నలు వేశారని తెలిపారు. దానిని దేశ ద్రోహంగా చెప్పుకొని రాహుల్ గాంధీని సస్పెండ్ చేశారని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీపై ఇలాంటి దుశ్చర్యను నిరసిస్తూ దేశంలో ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కానీ స్పందించలేదన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఒక్కరు కూడా స్పందించలేదని, అందుకు ఒక ఆంధ్రుడుగా సిగ్గు పడుతున్నానన్నారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేన తమ పార్టీలను ఎందుకు బీజేపీలో విలీనం చేయటం లేదని ప్రశ్నించారు. బీజేపీకి మద్దతుగా పోటీపడి మరీ ముందుకుపోతున్నారన్నారు. రాజ్యసభ సభ్యులు రంజిత రంజన్ మాట్లాడుతూ అదానీ గురించి ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీ సస్పెండ్ చేశారన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, ఏపీలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే విధంగా అందరూ సహకరించాలన్నారు. ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసి మన శక్తిని చూపెట్టాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఒక నిశ్శబ్ద విప్లవం తీసుకువద్దామని, బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ప్రస్తుతం ఉన్న ఎన్నో పథకాలు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టినవేనని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పేదలను వదిలేసి, కేవలం ధనికులకు కొమ్ము కాస్తోందన్నారు. పీసీసీ మాజీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ ప్రజలు, ప్రతి కాంగ్రెస్ వాది కర్నాటకలో పరిచయం ఉన్న వారితో మాట్లాడి కాంగ్రెస్‌కు ఓటు వేయమని చెప్పాలని కోరారు.

ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్య దర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు కాంగ్రెస్‌కు సంఘీభావం తెలుపుతూ లేఖ పంపించారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జాతీయ కో ఆర్డినేటర్ కొప్పుల రాజు మాట్లాడుతూ దేశ భవిష్యత్తును మోదీ కాలరాస్తున్నారన్నారు. సామాజిక న్యాయం కోసం, హిందుత్వంపై పోరాటానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, పీసీసీ ఉపాధ్యక్షుడు మస్తాన్‌వలి ప్రసంగించారు.

కాంగ్రెస్ జై భారత్ సత్యాగ్రహ సభకు సీపీఐ, సీపీఎం మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏఐసీసీ నేత రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వ కక్ష సాధింపు ధోరణి, పార్లమెంటు నుంచి రాహుల్ గాంధీ బహిష్కరణను నిరసిస్తూ విజయవాడలో ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేపట్టిన జై భారత్ సత్యాగ్రహ సభకు సీపీఐ, సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు ఉమ్మడి ప్రకటనను విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగిన సభా ప్రాంగణానికి పంపగా, దానిని కాంగ్రెస్ నేత జంగా గౌతమ్ చదివి వినిపించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యానికి పాతరేసిందని, రాజ్యాంగ విలువులకు తూట్లు పొడుస్తూ అనేక దుశ్చర్యలకు పాల్పడుతోందని వివరించారు. ప్రతిపక్ష పార్టీలపై కక్ష పూరిత ధోరణి ప్రదర్శిస్తోందని, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తుందని, ఇప్పటికే అనేక మంది మేధావులను జైళ్లకు పంపడంతో పాటు వివిధ రకాలుగా వేధింపులకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకున్న ప్రశ్నించే తత్వాన్ని గుర్తించిన మోదీ ప్రభుత్వం కోర్టు తీర్పును సాకుగా చూపి, పార్లమెంటులో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసిందని దుయ్యబట్టారు. ఇది అత్యంత అప్రజాస్వామిక చర్య అని, రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వ దుందుడుకు చర్యలను సీపీఐ, సీపీఎం రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయిలోనూ తీవ్రంగా ఖండిస్తున్నాయని, కాంగ్రెస్ ఆందోళనలకు సంఘీభావం తెలిపారని ఆయన వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.